# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

శుక్రవారం, 31 మే, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## అసెంబ్లీలో చర్చించాకే అధికార చిహ్నంపై నిర్ణయం: సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్:** తెలంగాణ అధికార చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహంపై ఇంకా విస్తృతంగా చర్చలు జరపాల్సి ఉందని, అసెంబ్లీలో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 2న రాష్ట్ర గీతాన్ని మాత్రమే ఆవిష్కరించనున్నారు. సీఎం సూచన మేరకు చిత్రకారుడు రుద్ర రాజేశం అధికార చిహ్నంపై కసరత్తు చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కూడా ఆయనతో చర్చించారు. సీపీఐ, సీపీఎం నేతలతోపాటు కోదండ రాం, తెలంగాణ జేఏసీ నేతలు పరిశీలించారు. కొత్త చిహ్నంలో రాచరిక గుర్తులు లేకుండా చూడాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా ప్రచారంలో ఉంది. కాకతీయ తోరణం, చార్మినార్‌లు కొత్త చిహ్నంలో లేకుండా రూపొందిస్తున్నారనే ప్రచారం జరిగింది. గురువారం సెక్రటేరియట్‌లో మంత్రులు, - మిగతా 2వ పేజీలో

# రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ

### యథాతథంగా ఆమోదించిన ప్రభుత్వం
### 2న జాతికి అంకితం చేస్తాం
### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
### కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, తెజస నేతలతో భేటీ



హైదరాబాద్: రాష్ట్ర గీతంపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దీపా దాస్‌మున్షీ, గుత్తా సుఖేందర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

ఉద్యమకాలంలో అన్ని వర్గాల ప్రజలను ఉర్రూతలూగించిన, తెలంగాణ ఖ్యాతిని చాటిన ఈ గీతాన్ని భవిష్యత్తులో తరతరాలు పాడుకునేలా, అందరి ఆమోదంతో రాష్ట్ర గీతంగా నిర్ణయించాం. తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ ఇరవై ఏళ్ల క్రితం రాసిన గీతాన్ని యథాతథంగా అమోదించాం.
-సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర గీతంగా 'జయ జయహే తెలంగాణ'కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ గీతం 2.30 నిమిషాల నిడివితో ఒకటి.. 13.30 నిమిషాల నిడివితో మరోటి రెండు వర్షన్లుగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆలపించేందుకు వీలుగా పూర్తి గేయంలోని మూడు చరణాలతో రెండున్నర నిమిషాల నిడివితో సంక్షిప్త గీతం రూపొందించారు. రెండింటినీ రాష్ట్ర గీతంగానే పరిగణించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మంత్రులు, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, తెజస నేతలతో పాటు తెలంగాణ బిల్లును ఆమోదించినప్పుడు ఎంపీలుగా ఉన్నవారు, ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన పార్టీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో సమావేశమై.. రాష్ట్ర గీతంపై చర్చించారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు కీరవాణి, ఆయన బృందం 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని ఆలపించింది. గీతం గురించి అందెశ్రీ వివరించారు."తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి జూన్ 2 నాటికి పదేళ్లు పూర్తవుతాయి. దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆ వేడుకల సందర్భంగా 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని జాతికి అంకితం చేస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని, అందులో భాగంగానే రాష్ట్రానికి సంబంధించిన సంక్షిప్త రూపం టీఎస్‌ను టీజీగా మార్చినట్లు తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లతో పాటు ప్రభుత్వ సంస్థల పేర్లలో సంక్షిప్త నామాన్ని టీజీగా మార్చామన్నారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్ర గీతాన్ని ఆమోదించినట్లు స్పష్టం చేశారు. సమావేశంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీ, సీనియర్ నేత కె.జానారెడ్డి, తెజస అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఇతర నాయకులు పాల్గొన్నారు. 'జయ జయహే తెలంగాణ'ను ప్రభుత్వం రాష్ట్ర అధికార గీతంగా ఆమోదించడంపై కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల నేతలు హర్షం వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం తెజస అధ్యక్షుడు కోదండరాం విలేకరులతో మాట్లాడుతూ- తాము కోరుకున్న రాష్ట్ర గీతం, చిహ్నాన్ని తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తోందని అన్నారు. 'తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో తొలిసారిగా భాగస్వామ్యం అవుతున్నాం. గతంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎప్పుడూ ఆహ్వానం అందలేదు. జయ జయహే తెలంగాణ కొత్తగా రాసిన పాట కాదు. రాసింది ఎవరనేదే ముఖ్యం.. పాడింది ఎవరన్నది కాదు. చిహ్నంపై గత ప్రభుత్వం చర్చ జరిపి ఉంటే బాగుండేది. దానిపై అభ్యంతరాలున్నా ఏమీ చేయలేని పరిస్థితులు అప్పుడున్నాయి. కొత్త లోగోలోనూ కట్టడాలు ఉంటాయని అనుకుంటున్నా' అని ఆయన పేర్కొన్నారు.

## అవతరణ వేడుకలకు సోనియా గాంధీ




### ముఖ్య అతిథిగా హాజరవుతారని ముఖ్యమంత్రి వెల్లడి
### కేసీఆర్‌కు సీఎం ప్రత్యేక ఆహ్వానం.. 2న పరేడ్ గ్రౌండ్‌లో ఉత్సవాలు
### సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక ప్రదర్శనలు
### 5 వేల మందితో 'ఫ్లాగ్ వాక్'

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. జూన్ 2న ఉదయం 10 గంటలకు పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు, సాయంత్రం తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు హాజరు కావాలంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగత ఆహ్వాన లేఖ పంపారు. ఈ లేఖతో పాటు ఆహ్వాన పత్రికను ఆయనకు స్వయంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ విభాగం సలహాదారు హర్కర వేణుగోపాల్‌ను, డైరెక్టర్ అరవింద్ సింగ్‌ను - మిగతా 2వ పేజీలో

## ఆవిర్భావ వేడుకలకు రండి

### చుక్కా రామయ్యను ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి



**కాచిగూడ:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనాలని విద్యావేత్త చుక్కా రామయ్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఆహ్వానించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ విద్యానగర్ పరిధి విజ్ఞాన్‌పురి కాలనీలోని చుక్కా రామయ్య నివాసానికి సీఎం వెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆవిర్భావ వేడుకలకు తప్పకుండా హాజరు కావాలని కోరారు. అనంతరం రామయ్యను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, యువజన కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మోత రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ధర్నాచౌక్‌లో బీజేపీ ధర్నా



### ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కోరుతూ నిరసనలు

**హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న 'ఫోన్‌ట్యా పింగ్' అంశాన్ని రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం చేయాలని బీజేపీ భావి స్తోంది. ఫోన్‌ట్యాపింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ లేదా సమగ్ర దర్యాప్తు జరిపించాలనే డిమాండ్‌తో ధర్నాలు, వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమైంది. ఈ కార్యాచరణలో భాగంగా...శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించనుంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ కొనసా గుతున్న నేపథ్యంలో...ఈ ధర్నా నిర్వహణకు ఎన్ని కల కమిషన్ అనుమతి కోరుతూ రాష్ట్ర పార్టీ లేఖ రాసింది. ధర్నాచౌక్‌లో నిరసన తెలిపేందుకు పోలీసుల అనుమతి కోరుతూ సంబంధిత అధికారులకు లేఖను అందజేసింది. ఈ ఆందోళనా కార్యక్రమంలో బీజేపీ ఓబీసీమోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, సీనియర్ నాయకులు పాల్గొననున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను నీరుగార్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి కేసును తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

## విత్తనాలను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే పీడీయాక్ట్



### జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసిన సీఎస్ శాంతి కుమారి

**హైదరాబాద్:** విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరతను సృష్టించే వ్యాపారులపై పీడీ చట్టం కింద కేసులను నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో వానాకాలం పంటలకు విత్తనాల సరఫరా, జూన్ 2వ తేదీన జరిపే రాష్ట్ర అవతరణ ఉత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో ఆమె గురువారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీఏడీ, వ్యవసాయ శాఖల కార్యదర్శి రఘునందన్‌రావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ వానాకాలానికి సంబంధించి గత సంవత్సరం కన్నా అధిక మొత్తంలో వివిధ రకాల పంట విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విత్తనాల విషయంలో ఆందోళన చెందవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో అధిక డిమాండ్ ఉన్న పత్తి, సోయా, మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాలు సరిపడా ఉన్నాయని వివరించారు. వీటితోపాటు జీలుగ విత్తనాలు కూడా కావాల్సినంతగా అందుబాటులో ఉంచినట్లు - మిగతా 2వ పేజీలో

## రాజకీయ కుట్రతో చారిత్రక చిహ్నాల తొలగింపు

### చార్మినార్ చిహ్నాన్ని తొలగించడమంటే హైదరాబాదీలను అవమానించడమే: కేటీఆర్
### జాక్‌పాట్ సీఎం ఆలోచనను వ్యతిరేకిస్తున్నాం
### కేసీఆర్‌పై కక్షతోనే ప్రజా వ్యతిరేక పనులు
### ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతిస్తే ఊరుకోం
### చార్మినార్ వద్ద పార్టీ నేతలతో కలిసి కేటీఆర్ నిరసన
### గుల్జార్‌హౌస్ నుంచి చార్మినార్ వరకు ర్యాలీ



**చార్మినార్ (హైదరాబాద్):** తెలంగాణ రాజముద్ర లోని చారిత్రక చిహ్నాలను రాజకీయ కుట్రతోనే మార్చాలనుకుంటున్నారని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. జాక్‌పాట్ ముఖ్యమంత్రి మూర?పు ఆలోచనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తెలంగాణ రాజముద్రలో చార్మినార్, కాకతీయ కళాతోరణం చిహ్నాలను తొలగించాలని రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ కేటీఆర్ ఆధ్వర్యంలో బుధవారం చార్మినార్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం గుల్జార్‌హౌజ్ నుంచి చార్మినార్ వరకు కాలినడకన వచ్చిన ఆయన చార్మినార్ వద్ద విలేకరులతో మాట్లాడారు. చేతనైతే గత పదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి తప్ప.. కేసీఆర్‌పై కక్షతో ఆయన చేసిన అభివృద్ధిని కాలరాయొద్దని హితవు పలికారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు.

**చారిత్రక గుర్తింపును విస్మరించారు..**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉన్న వారసత్వ కట్టడాల చిహ్నాలను రాజ ముద్ర నుంచి తొలగించాలని చూడటం తెలుగు ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమేనని కేటీఆర్ చెప్పారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ కట్టడాలకు చారిత్రక గుర్తింపు ఉందన్న విషయా లను సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించడం దురదృష్టకరమ న్నారు. లేని వాటిని చేర్చితే మంచిదే గానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోయిన చిహ్నాలను ఎలా తొలగిస్తారని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మనోభావాలను దెబ్బతీసే - మిగతా 2వ పేజీలో

## జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి నైరుతి



### జూన్ 5 నుంచి 11 మధ్య రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం
### ఈలోగా మరింతగా దంచికొట్టనున్న ఎండలు
### మూడు రోజులపాటు రాష్ట్రంలో తీవ్రం కానున్న ఉష్ణోగ్రతలు..
### ఈ సీజన్‌లోనే అత్యధికంగా మంచిర్యాల జిల్లా భీమారంలో గురువారం 47.2 డిగ్రీల సెల్సియస్ నమోదు

**హైదరాబాద్:** కేరళలోకి గురువారం ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు క్రమంగా ముందుకు సాగుతూ జూన్ 5 నుంచి 11 మధ్య తెలంగాణలోకి ప్రవేశించి విస్తరించే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈలోగా పగటి - మిగతా 2వ పేజీలో

## డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



**రాజేంద్రనగర్:** గుట్టు చప్పుడు కాకుండా నిషేధిత డ్రగ్స్‌ను విక్రయిస్తున్న ఇద్దరిని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 270 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సన్‌సిటీ బండ్లగూడ జాగీర్‌లోని ఓ సూపర్ మార్కెట్ సమీపంలో గురువారం - మిగతా 2వ పేజీలో

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
శుక్రవారం, 31 మే, 2024

## అసెంబ్లీలో చర్చించాకే అధికార చిహ్నంపై నిర్ణయం: సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వివిధ పార్టీల నాయకులు తదితరులతో సమావేశమైనప్పుడు కూడా అధికార చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహంపై అనేక సూచనలు వచ్చాయని, దీనిపై ఇంకా విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకొంటామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారుల నుంచి దాదాపు 500 నమూనాలు తమకు అందినట్లు ఆయన వెల్లడించారు. నమూనాలన్నీ చర్చల దశలోనే ఉన్నాయని, చిహ్నానికి సంబంధించి తుది రూపమేమీ ఇంకా ఖరారు కాలేదన్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి కూడా తుది నిర్ణయం జరగలేదని, నమూనాలు తయారు చేస్తున్నారన్నారు. కొత్త చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాలకు సంబంధించి అపోహలు, తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా తెలంగాణ ప్రతిష్ఠ ఇనుమడించేలా, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా తమ కార్యాచరణ ఉంటుందని సీఎం వివరించారు.

## విత్తనాలను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే పీడీయాక్ట్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. విత్తన వ్యాపారుల గోదాములు, దుకాణాలను తనిఖీ చేయించాలని కలెక్టర్లను ఆదేశించారు. దీనితోపాటు, గోదాములు, విత్తన విక్రయ కేంద్రాలవద్ద పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. రైతులతో సమావేశమై, సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వారిలో విశ్వాసం కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి రైతులు వచ్చి ఇక్కడి విత్తనాలు కొనుగోలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**జిల్లా కలెక్టర్లతో పతాకావిష్కరణ**

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ రెండవ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో కలెక్టర్లు జాతీయ జెండాను ఆవిష్కరించాలని సీఎస్ శాంతికుమారి స్పష్టం చేశారు. రాష్ట్ర అవతరణ కోసం అమరులైన వారికి నివాళులు అర్పించిన అనంతరం కలెక్టర్లు జాతీయ పతాకావిష్కరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను, ఇతర ప్రముఖులను, జిల్లా అధికారులను ఆహ్వానించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమంలో అమర వీరులైన వారి కుటుంబ సభ్యులకు, ఉద్యమ కారులకు జిల్లా కలెక్టర్ల ద్వారా ఆహ్వానం పంపుతున్నట్లు తెలిపారు.

## రాజకీయ కుట్రతో చారిత్రక చిహ్నాల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

విధంగా వ్యవహరిం చడం మంచిది కాదని హితవు పలికారు. చార్మినార్ చిహ్నాన్ని తొలగించడమంటే ప్రతి హైదరాబాదీని అవమానించినట్లేనన్నారు. ఎన్నో ఉద్యమాలు, త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని.. వీరందరి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే విధంగా ఉన్న ఈ నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పద్మారావు, మాగంటి గోపీనాథ్, మాజీ మంత్రులు రాజయ్య, పొన్నాల లక్ష్మయ్య, చార్మినార్ బీఆర్ఎస్ ఇంచార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ తదితరులు పాల్గొన్నారు.

## అవతరణ వేడుకలకు సోనియా గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. గజ్వేల్ ఫాంహౌస్‌లో కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక, లేఖ అందించనున్నామని హర్కర వేణుగోపాల్ తెలిపారు.

**అమరులకు నివాళులతో ప్రారంభం:** తొలుత 2వ తేదీన ఉదయం 9.30 గంటలకు గన్‌పార్క్‌లో అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలర్పించిన వారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పిస్తారు. ఉదయం 10 గంటలకు పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని సీఎం ఆవిష్కరిస్తారు.పోలీసు బలగాల పరేడ్, మార్చ్‌పాస్ట్, వందన స్వీకార కార్యక్రమం ఉంటాయి. రాష్ట్ర అధికారిక గీతాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం సోనియా గాంధీ, ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. పోలీసు సిబ్బందికి, ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానంతో ఉత్సవాలు ముగుస్తాయి. ట్యాంక్‌బండ్‌పై జయ జయహే తెలంగాణ సాయంత్రం 6.30 గంటలకు ట్యాంక్‌బండ్‌పై రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు ప్రారంభమవుతాయి. అక్కడ హస్తకళలు, ప్రత్యేక ఉత్పత్తులు, వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం 6.30 గంటలకు స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శిస్తారు. అనంతరం తెలంగాణ కళారూపాల ప్రదర్శనకు అద్దం పట్టే కార్నివాల్ నిర్వహిస్తారు. దాదాపు 700 మంది కళాకారులు ఇందులో పాల్గొంటారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన వేదికపై 70 నిమిషాల పాటు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తారు. జాతీయ జెండాలతో ట్యాంక్‌బండ్‌పై ఒక చివరి నుంచి మరో చివరి వరకు భారీ ఫ్లాగ్ వాక్ నిర్వహిస్తారు. దాదాపు 5 వేల మంది ఇందులో పాల్గొంటారు. ఈ ఫ్లాగ్ వాక్ జరుగుతున్నంతసేపు 13.30 నిమిషాల పాటు సాగే పూర్తి నిడివితో ఉన్న 'జయ జయహే తెలంగాణ' గీతం ఆలపిస్తారు. గీత రచయిత అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణిలను సన్మానిస్తారు. రాత్రి 8.50 గంటలకు పది నిమిషాల పాటు బాణసంచా కాల్చే కార్యక్రమంతో వేడుకలను ముగిస్తారు.

## జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి నైరుతి

(మొదటి పేజీ తరువాయి)


ఉష్ణోగ్రతలు మరికొంత పెరగొచ్చని పేర్కొన్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఎండలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం పశ్చిమ, వాయవ్య దిశల నుంచి వడగాడ్పులు వీస్తుండటంతో గురువారం రాష్ట్రంలో చాలాచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచిర్యాల జిల్లా భీమారంలో అత్యధికంగా 47.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతగా నమోదైంది. ఇప్పుటివరకు ఈ వేసవిలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. అలాగే భద్రాద్రి కొత్తగుడెం జిల్లా గరిమెల్లపాడులో 47.1 డిగ్రీల సెల్సియస్, కమాన్‌పూర్‌లో 46.7, కుంచవల్లిలో 46.6, కాగజ్‌నగర్, పమ్మిలో 46.5, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగత నమోదైంది. చాలాచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారుణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు వాతామురణ శాఖ తెలిపింది. అలాగే రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే ఖమ్మంలో 44.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది.

## పత్తి విత్తనాల కోసం అన్నదాతల ఆందోళన..

**ఆదిలాబాద్:** ఆదిలాబాద్‌లో పత్తి విత్తనాల కోసం రైతులు నిరీక్షించి.. విసిగి వేసారి ఆందోళన చేపట్టారు. స్థానిక తాంసి బస్టాండ్ ప్రాంతంలోని ఓ దుకాణం ఎదుట గురువారం ఉదయం నుంచి భారీ సంఖ్యలో అన్నదాతలు బారులు తీరారు. స్టాక్ రాలేదని డీలరు చెప్పడంతో రైతులంతా పంజాబ్ చౌక్‌లో రాస్తారోకో చేపట్టారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు శాంతించలేదు. అదే సమయంలో అంతకుముందు స్టాక్ లేదని చెప్పిన దుకాణం నుంచే ఓ జీపులో నాలుగు బ్యాగుల్లో ఒక కంపెనీకి చెందిన విత్తన ప్యాకెట్లు తరలించడాన్ని రైతులు చూడటం.. కలకలం రేకెత్తించింది. జీపు ముందుకు కదలకుండా టైర్లలో గాలితీశారు. అందులోని విత్తనాలను బయటకు తీసి పంపిణీ చేసేందుకు ప్రయత్నాలు చేసిన రైతులను పోలీసులు నివారించడంతో ఉద్రిక్తతకు దారితీసింది.

# రేవంత్ రెడ్డి, అందెశ్రీ మోసం చేశారు.. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్వీ మల్లిక్ తేజ ఆవేదన

జయ జయహే తెలంగాణ పాటను మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణితో కంపోజ్ చేయించడం పట్ల జగిత్యాలకు చెందిన సంగీత దర్శకుడు ఎస్వీ మల్లిక్ తేజ ఆవేదన వ్యక్తం చేశారు. జయ జయహే పాటకు అర్జెంట్‌గా సంగీతం అందించాలని ఏడాదిన్నర క్రితం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క కోరారని ఆయన తెలిపారు. అప్పుడు అదే రోజు పొద్దున చెబితే.. అన్ని పనులను పక్కనబెట్టుకుని పాటకు సంగీతం అందించానని చెప్పారు. అప్పుడు ఉన్న తక్కువ సమయంలో పరిమితమైన బడ్జెట్‌లో పాట రూపకల్పన చేసి ఇచ్చానని తెలిపారు. తాను కంపోజ్ చేసి పాట విన్న తర్వాత అద్భుతంగా పాట చేశానని అందెశ్రీ ప్రశంసించారని మల్లిక్ తేజ తెలిపారు. మహిళల బృందగానంతో బాగుందని మెచ్చుకున్నారని తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో రూపొందించే అవకాశాన్ని తనకే



కల్పిస్తామని మాట ఇచ్చారని పేర్కొన్నారు. అయితే తనకు కాకపోయినా.. వేరే తెలంగాణ వాళ్లకు కాకుండా కీరవాణితో పాడించడం బాధగా ఉందన్నారు. కీరవాణి అంటే అందరికి అభిమానం ఉంటుంది.. కానీ ఆయన్ను తలదన్నే మ్యూజిక్ డైరెక్టర్ తెలంగాణలో లేదని అనడం బాధగా అనిపించిందని అన్నారు. అప్పుడు ఏడాదిన్నర కిందట కూడా కీరవాణితో పాడించుకుంటే అయిపోయేది కదా అని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ లేదన్నప్పుడు చిన్న కళాకారులతో పాడించారని.. ఇప్పుడు ప్రభుత్వం వచ్చి, సమయం ఉండి.. సరిపడా బడ్జెట్ ఉన్న సమయంలో కూడా చిన్న కళాకారులకు అవకాశం ఇచ్చి ఉంటే గుండెల్లో పెట్టుకునే వారని అన్నారు. వాళ్లు ఆస్కార్ గ్రహీతలు అని.. మీరిచ్చే అవకాశం వాళ్లకు ఆస్కార్ కిందనే ఉంటది తప్ప ఆస్కార్‌పైన ఉండదని తెలిపారు. మాలాంటి చిన్న కళాకారులకు అవకాశమిస్తే మరింత ప్రేమతో పనిచేసేవాళ్లం కదా అని చెప్పుకొచ్చారు.

# రూ. 200 కోట్ల మోసం కేసులో నిమ్మగడ్డ వాణి అరెస్టు

**ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ కేసులో టెస్కాబ్ జీఎం, ఆమె భర్త, కుమారుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**24 శాతం వడ్డీ ఇస్తామని ఆశచూపి రూ. కోట్లలో డిపాజిట్ చేయించుకున్న కుటుంబం**

**కొన్ని నెలలుగా వడ్డీ చెల్లింపులు బంద్..**

**'ఐపీ' పెట్టి పరారీ మొత్తం బాధితుల సంఖ్య 532..**

హైదరాబాద్: తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్‌లో (టెస్కాబ్) జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ ముసుగులో రూ.200 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేసి మోసానికి పాల్పడిన నిమ్మగడ్డ వాణీబాల, ఆమె భర్త, కుమారుడిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంస్థ చేతిలో మోసపోయిన 532 మందిలో 147 మంది టెస్కాబ్ ఉద్యోగులేనని డీసీపీ ఎన్.శ్వేత గురువారం తెలిపారు. వాణీబాలతోపాటు ఆమె భర్త మేక నేతాజీ, కుమారుడు మేక శ్రీహర్షలను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

**అధిక వడ్డీ ఆశచూపి...:** ఏపీలోని ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన మేక నేతాజీ 1985లో హైదరాబాద్‌లోని తిలక్ రోడ్‌లో శ్రీ ప్రియాంక ఫైనాన్స్ అండ్ చిట్‌ఫండ్స్ పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. ఇతర వ్యాపారాలు కూడా చేసిన



ఆయన.. వాటి నిర్వహణ కోసం ప్రియాంక సంస్థ ద్వారా డిపాజిట్లు సేకరించడం మొదలుపెట్టారు. తమ వద్ద నగదు డిపాజిట్ చేస్తే ఏడాదికి 24% చొప్పున వడ్డీ చెల్లిస్తానంటూ నమ్మబలికాడు. అలాగే ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ పేరుతో మరో సంస్థ ఏర్పాటు చేసి ముద్రణ రంగంలో వినియోగించే ప్లేట్లు, రంగులు తదితరాలను కంపెనీల నుంచి కొని ప్రింటింగ్ ప్రెస్‌లకు విక్రయించడం మొదలెట్టారు. నేతాజీ భార్య నిమ్మగడ్డ వాణీబాల ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్‌లో ఉద్యోగంలో చేరారు. రాష్ట్ర విభజన తర్వాత టెస్కాబ్‌గా మారిన ఈ సంస్థలో కొనసాగారు. రాష్ట్ర స్థాయి పోస్టు అయిన జనరల్ మేనేజర్ వరకు వెళ్లారు. శ్రీహర్ష తన తండ్రి నిర్వహిస్తున్న సంస్థలోనే డైరెక్టర్‌గా చేరా రు. వాణీబాల టెస్కాబ్‌లో పనిచేసే ఉద్యోగులను భర్త సంస్థలో పెట్టుబడులు పెట్టాలని హుకుం జారీ చేసింది. దీంతో 147 మంది రూ. 26 కోట్ల డిపాజిట్లు చేశారు. అలాగే టెస్కాబ్‌లో డిపాజిట్ చేయడానికి వచ్చే వారిని సైతం మాయమాటలతో నమ్మించి పెద్ద మొత్తంలో డిపాజిట్ చేయించుకుంది.

**రశీదులన్నీ వేరే సంస్థ పేరుతో..**

తమ వద్ద పె ట్టుబడులు పెట్టిన డిపాజిట్‌దారులకు ఇవ్వడానికి నేతాజీ, శ్రీహర్షలు ప్రత్యేకంగా శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ పేరుతో రసీదులు తయారు చేయించారు. దీనిపై వివరాలు రాసి రూపాయి విలువైన రెవెన్యూ స్టాంప్ అతికించి సంతకాలు చేసిచ్చారు. కరోనా తర్వాత కాస్త ఒడుదొడుకులు ఎదురైనా గతేడాది నవంబర్, డిసెంబర్ నుంచి వినియోగదారులకు వడ్డీ చెల్లింపులు ఆపేశారు. ఈ నెల 3న సిటీ సివిల్ కోర్టులో ఏకంగా దివాలా పిటిషన్ (ఐపీ) దాఖలు చేసి ముగ్గురూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్ నేతృత్వంలోని బృందం గురువారం ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించింది. విచారణ నిమిత్తం 14 రోజుల కస్టడీకి కోరాలని నిర్ణయించింది.

## డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

మహారాష్ట్రకు చెందిన తృప్తి ప్రభాకర్ హెూకం (21), మధ్యప్రదేశ్ శివపురి గ్వాలియర్ ప్రాంతానికి చెందిన అనుభవ్ సక్సేనా (24)లు బ్యాగ్‌తో ప్యాసింజర్ ఆటోదిగి అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దీనిపై సమాచారం అందుకున్న శంషాబాద్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాఘవేందర్, కానిస్టేబుళ్లు వారిని అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా తెల్లటి పౌడర్ రూపంలో ఉన్న 270 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ లభించింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టగా.. తాము ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ.. ఎండీఎం డ్రగ్స్‌ను ఐటీ, ఈవెంట్ మేనేజర్లకు విక్రయిస్తున్నామని తెలిపారు. తాము చంద్రపూర్‌కు చెందిన సాబేర్ అనే వ్యక్తి ద్వారా కొరియర్ తెప్పించుకొని ఎక్కువ ధరలకు హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎండీఎంఏ డ్రగ్ విలువ మార్కెట్‌లో రూ.20 లక్షలు ఉంటుందన్నారు.

## అన్నారం బ్యారేజీలో ఇసుక తొలగింపు పూర్తి



**కాళేశ్వరం:** కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ ఎగువన పిల్లర్ల వద్ద పేరుకుపోయిన ఇసుక తొలగింపు పూర్తి కావస్తోంది. దీంతో ఎన్డీఎస్ఏ అధికారుల పరిశీలనకు, ఇతరత్రా మరమ్మతులకు అనుకూలంగా మారింది. బ్యారేజీ ఎగువ ప్రాంతంలో భారీగా ఇసుక మేటలు వేయడంతో ప్రభుత్వ అనుమతులతో ఇసుక తొలగింపు ప్రక్రియ గత నెల 23 నుంచి ప్రారంభించారు. గతంలో ఎన్డీఎస్ఏ బృందం పర్యటించిన సమయంలో భారీగా ఇసుక మేటలు వేయడంతో పరిశీలనకు అడ్డుగా ఉందని, వెంటనే తొలగించాలనే ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. వారి సూచనలకు అనుగుణంగా 106 మీటర్ల మేర 2 లక్షల టన్నుల ఇసుకను ప్రస్తుతం తొలగించడంతో పిల్లర్ల వద్ద సీసీ బ్లాక్‌లు బయటపడ్డాయి. అక్కడ బోర్‌లాక్ పనులు చేపట్టి బ్యారేజీ ఫౌండేషన్‌ను పరీక్షిస్తారని తెలిసింది. ఈ మేరకు సామగ్రి గురువారం సరస్వతీ బ్యారేజీకి చేరుకుంది. ఈఈ యాదగిరి మాట్లాడుతూ.. సిమెంట్ గ్రౌటింగ్ పనులు మూడు రోజుల్లో ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

## కుట్టు కూలి రూ.70కు పెంచేందుకు చర్యలు: సందీప్‌కుమార్ సుల్తానియా

**సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్):** మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకే సర్కారు బడుల్లో ఏకరూప దుస్తుల కుట్టు పని అప్పగించడంతో పాటు వారి కోరిక మేరకు రూ.50 ఉన్న జత(డ్రెస్) కుట్టు కూలిని రూ.70కు పెంచేలా త్వరలో జీవో విడుదల చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా తెలిపారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా స్వశక్తి కుట్టు కేంద్రాన్ని సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావుతో కలిసి ఆయన గురువారం సందర్శించారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వారు కుట్టిన ఏకరూప దుస్తులను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షల జతలు కుట్టే బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసి మహిళలకు భరోసా కల్పిస్తున్నామని అన్నారు. వస్త్రం కటింగ్‌కు ఎక్కువ సమయం పడుతోందని మహిళలు చెప్పగా అందుకోసం ప్రత్యేకంగా యంత్రాలు సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

## సర్వాంగ సుందరంగా ట్యాంక్‌బండ్

**వైభవంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాల నిర్వహణకు సన్నాహాలు**

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కార్యక్రమాలు**

**తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ట్యాంక్ బండ్ పొడవునా మొక్కలు నాటుతున్న సిబ్బంది**



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. ఆ ప్రాంతాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూల మొక్కలతో అలంకరి స్తున్నారు. జూన్ 2న ఉదయం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై దశాబ్ది అవతరణ దినోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాబృందాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ కళారూపాలతో ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ప్రధాన వేదికపై పలు శాస్త్రీయ, జానపద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్ర అధికారిక గీతం "జయజయహే తెలంగాణ"పై పోలీసు సిబ్బంది ప్రదర్శన చేపడతారు. ఉత్సవాలకు పెద్దఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో భద్రత, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రతువులో రహదారులు, భవనాలు, బల్దియా, హెచ్ఎండీఏ, జలమండలి, విద్యుత్తు, పర్యాటక, సమాచార, అగ్నిమాపక, పోలీసు తదితర శాఖలు నిమగ్నమయ్యాయి. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు అందుబాటులో ఉంటాయి.

## ప్రీస్కూల్స్‌గా అంగన్‌వాడీలు!

**రాష్ట్ర ప్రభుత్వ యోచన..**

**తొలి విడతలో ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో ఉన్న 15 వేల కేంద్రాల అప్‌గ్రేడేషన్**

**హైదరాబాద్:** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను క్రమంగా పూర్వ ప్రాథమిక పాఠశాలలు (ప్రీ స్కూల్స్)గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. జాతీయ విద్యా విధానం-2020కు అనుగుణంగా వీటిని అభివృద్ధి చేసేలా రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది. తొలి విడత కింద ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో ఉన్న వాటిని ప్రీస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేసే దిశగా చర్యలు వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల సమాచారాన్ని క్రోడీకరించిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ.. ఈ మేరకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ కేంద్రాల ఆధునీకరణకు అవసరమైన మౌలిక వసతులు,నిధులు...తదితర అంశాలతో ప్రతిపాదనలను ప్రాథమికంగా ఖరారు చేశారు. వీటిని ప్రభుత్వ ఆమోదం కోసం పంపినట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో..



జూన్ 6 తర్వాత ప్రభుత్వం ఆమోదం పొందే అవకాశం ఉన్నట్లు తెలిపాయి.

**వసతులకు రూ.30 కోట్లు:** ప్రస్తుతం తెలంగాణలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు న్నాయి. వీటిలో 15,640 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల పరిధిలో కొనసాగుతున్నాయి. వీటిల్లోనే సూత్రప్రాయంగా ప్రీ స్కూల్ విద్యను అమలు చేసేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాచరణ రూపొందించింది. వీటి పరిధిలోని 3 లక్షల మంది 3-6 సంవత్సరాల మధ్యనున్న చిన్నారులకు ప్రీస్కూల్ విద్యను అందించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా కార్పెట్ల కొనుగోలు కోసం రూ.3.57 కోట్లు బడ్జెట్ అవసరమని ప్రతిపాదించింది.

# పీర్జాదిగూడలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను విజయవంతం చేద్దాం

**నీళ్లు, నిధులు, నియామకంపై జరిగిన ఉద్యమమే తెలంగాణ ఉద్యమం..!**

**తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన పార్టీ బి ఆర్ ఎస్..!**

**ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి..!**



వాయిస్ టుడే న్యూస్, మే 29 మేడిపల్లి : తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్ది కాలం గడుస్తున్న సందర్భంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముగింపు వేడుకలు నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారని పీర్జాదిగూడ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి తెలిపారు.మేయర్ జక్క వెంకట్ రెడ్డి, అధ్యక్షులు బండారి రవీందర్ సూచనల మేరకు వేడుకల నిర్వహణపై ఈరోజు బీఆర్ఎస్ కార్యాలయంలో సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు,కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన పార్టీ బీఆర్ ఎస్ అని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 సంవత్సరాలు శాంతియుతంగా పోరాటంలో తెలంగాణ ప్రాంతంలో ఉన్నటువంటి అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ఆనాటి పరిస్థితులకు వ్యతిరేకంగా జరిగినటువంటి ఉద్యమ ప్రస్థానమే తెలంగాణ రాష్ట్రం అన్నారు. నీళ్ళు, నిధులు, నియామకంపై జరిగిన ఉద్యమం తెలంగాణ ఉద్యమం అని, అనేక అపవాదులు, అవమానాలు గురైనా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే తప్ప ఈ ప్రాంతానికి విముక్తి లేదని, అభివృద్ధి సాధించదని కేసీఆర్ పట్టుదలతో తెలంగాణ నినాదాన్ని తీసుకొని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకపోతే కాళేశ్వరం లాంటి బహుళార్థక నిర్మాణం జరిగేది కాదని, తెలంగాణలో 24గంటల కరెంటు వాడినం అంటే తెలంగాణ ఉద్యమ విజయమన్నారు. రైతాంగం మూడు కోట్ల 20లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం పండించామంటే తెలంగాణ ఉద్యమేమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్ది కాలం గడుస్తు న్న సందర్భంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యం లో ముగింపు వేడుకలు జూన్ 1వ తేదీ నాడు గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్ బండ్ వద్దగల అమరజ్యోతి వరకు సాయంత్రం 7గంటలకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి, రాష్ట్ర సాధనలో ప్రాణాలు త్యాగం చేసిన అమరులకు పుష్పాంజలి ఘటించి ఘననివాళి అర్పిస్తారన్నారు. తెలంగాణ ఆవిర్భావ జూన్ 2న ముగింపు వేడుకల సభను తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు తెలిపారు. అదేరోజు హైదరాబాద్‌లో పలు దవాఖానాలలో అనాథ శరణాలయాలలో పార్టీ ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జూన్ 3న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ధి ముగింపు వేడుకలు నిర్వహించి పార్టీ జెండాను, జాతీయ జెండాను ఆవిష్కరించి స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తారని వివరించారు. ఈ చారిత్రక సందర్భంలో దశాబ్ది ముగింపు వేడుకలను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల,మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా,యూత్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు జావీద్ ఖాన్,ఆంజనేయులు, బాలరాజు,వెంకన్న,యాసారం శ్రీనివాస్, కిరణ్, జగన్ రెడ్డి,శంకర్ రావు, నాయకులు జోగి రెడ్డి,మల్లం వెంకటేష్ గౌడ్, చిర్ర సంతోష్ రెడ్డి,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



## సీఎం సహాయనిధి ఎల్‌వోసీ అందజేసిన ఉప్పల్‌ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- రామాంతపూర్ డివిజన్,బాలాజీ నగర్ కు చెందిన మల్లేష్ యాదవ్ కు మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఒక లక్ష యాభై వేల రూపాయలు మంజూరయ్యాయి. ఈ మొత్తానికి సంబంధించిన ఎల్‌వోసీని ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో బాధితునికి అందించారు. ఈ కార్యక్రమం లో ఉప్పల్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వరావు ,బొసాని పవన్ ,చాంద్ పాషా ,సురం శంకర్ ,పాపి రెడ్డి ,అనంద్ ,టోనీ తదితరులు పాల్గోన్నారు.



ప్రజా సమస్యలను పరిష్కరించాలని వచ్చిన ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు తాను ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు మీకు ఎల్లప్పుడూ నేను అండగా ఉంటా.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు.. రేవంతన్న ఎల్లప్పుడూ అండగా ఉంటారు..రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉప్పల్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు నిత్యం అందజేస్తానని, ప్రజలకు అభయమిస్తున్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్ రెడ్డి తదితరుల దృశ్యం. - ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి)



## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిను కలిసిన బాబా ఫసియుద్దీన్..

జూబ్లీహిల్స్ 30 మే (వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో సచివాలయంలో ఏర్పాటైన సమీక్ష సమావేశాలలో పాల్గొన్న మంత్రులు పార్టీ అధికార ప్రతినిధులు జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి మరియు మాజీ డిప్యూటీ మేయర్ బోరబండ కార్పొరేటర్ బాబా పసియుద్దీన్ పాల్గొన్నారు

## బిల్డర్ల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తా: ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



శేరిలింగంపల్లి, మే 30(వాయిస్ టుడే) జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ 8వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, సినీ హీరో మురళి మోహన్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, వెస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యలతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ బిల్డర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారిస్తానని, తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. బిల్డర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ ,అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన ఘనకార్యాలు ఏంటి?

### కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి

కూకట్‌పల్లి, మే 30(వాయిస్ టుడే): బీఆర్ఎస్ ప్రభుత్వంలో కవిత బతుకమ్మ పాటలు ఏ ఆర్ రెహమాన్ తో పాడిస్తే ఆంధ్ర ప్రాంతం వారు కాదా అని ప్రశ్నించారు. చిన్న జీయర్ స్వామి ట్రస్టుకు ఎకరానికి 12 కోట్ల విలువగల భూమిని కేవలం 16 లక్షలకు కట్టబెట్టారని, ఆయన ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు కాదా అని గుర్తు చేశారు. కాలేశ్వరం ప్రాజెక్టును లక్షల కోట్ల విలువ గల కాంట్రాక్టును మేఘ కృష్ణారెడ్డి కి అప్పగించిన వారు ఆంధ్రులు కాదా అని ప్రశ్నించారు. యాదగిరిగుట్ట క్షేత్రంలో డిజైను ఆనంద్ సాయి కి ఇచ్చిన మీరు అప్పుడు ఆంధ్ర వాళ్ళ గుర్తుకు రాలేదా? మీరు చేస్తే ఒప్పు ఇతరులు చేసే తప్పా అని ధ్వజమెత్తారు. ఇలాంటి చిల్లర ట్రిక్కులు, పాలిటిక్స్ రాజకీయాలు మానుకొని ఇప్పటికైనా తెలంగాణ ప్రజలకు సరైన సమాచారాలను ఇవ్వాలని గుర్తు చేశారు. హీరోయిన్ సమంత కు మన బ్రాండ్ అంబాసిడర్ చేశారని, కోట్లాది రూపాయలు ఇచ్చినవారు మీదేకదా అన్నారు. శారదా పీఠానికి రెండు కోట్ల విలువ గల చేసే భూమిని ఒక రూపాయి కట్టబెట్టింది మీరు వారు ఆంధ్ర కాదా తెలంగాణలో స్వామీజీలు లేరా ?కాంట్రాక్టర్లు లేరా? తెలంగాణ కు చెందిన వారు బ్రాండ్ అంబాసిడర్ పనికిరారా అప్పుడు ఎందుకు ఆంధ్ర వాళ్ళకి ఇచ్చారు? రాజకీయ డ్రామాలు మానుకోవాలని హితవు పలికారు, తెలంగాణకు చెందిన



గాయకుడు అందెశ్రీ పాడిన గేయానికి సంగీతం ఆస్కార్ అవార్డు కీరవాణి అందిస్తే తప్పేంటని, గీతాన్ని రాష్ట్ర గీతంగా గుర్తించకపోవడం మీకు సిగ్గుచేటన్నారు. దాన్ని రాష్ట్ర గీతంగా ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ గుర్తించి తీసుకోవడం ద్వారా ఆమోదించిన విషయంలో దానికి గగ్గోలు పెట్టడం సబబు కాదన్నారు. రాజముద్రలో అమరవీరుల స్తూపం ఉంటే తప్పేముందని అమరవీరుల త్యాగాల ఫలితం రాష్ట్రం వచ్చింద నారు. మంచిని స్వాగతించాలి కానీ అడ్డగోలుగా మాట్లాడడం సబబు కాదని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు

## క్యాబ్‌ను అడ్డగించి సాఫ్ట్ వేర్ ఉద్యోగుల అర్ధరాత్రి దోపిడి

- మద్యం మత్తులో ఆకతాయిల ఆగడాలు
- క్యాబ్ డ్రైవర్ మెడపై బ్లేడుతో దాడి
- సెల్ ఫోన్లు, నగదు దోచుకున్న ఆకతాయిలు



కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (మే 30) : మద్యం మత్తులో ఆకతాయిలు అర్ధరాత్రి క్యాబ్ ను అడ్డగించి, డ్రైవర్ పై దాడి చేసి సాఫ్ట్ వేర్ ఉద్యోగుల వద్ద దోపిడీకి పాల్పడిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... గురువారం అర్ధరాత్రి 2.30 గంటలకు అనిల్ (24) తన క్యాబ్ లో ఇద్దరు సాఫ్ట్ వేర్ ఉద్యోగులను మాదాపూర్ నుంచి జీడిమెట్ల పిఎస్ పరిధిలోని నెహ్రూ నగర్ కు తీసుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నెహ్రూ నగర్ ప్రధాన రహదారికి చేరుకోగానే మున్నా, రాజా సింగ్, అఖిల్ తో పాటు మరో ఇద్దరు ఆకతాయిలు మద్యం మత్తులో క్యాబ్ ను అడ్డగించి ఉద్యోగుల వద్ద డబ్బు డిమాండ్ చేశారు. వారి వద్ద నుంచి సెల్ ఫోన్లు, కొంత నగదును లాక్కున్నారు. అంతేకాకుండా డ్రైవర్ మెడపై బ్లేడుతో దాడి చేసి గాయపరిచారు. దీనిని గమనించిన స్థానికులు డ్రైవర్ అనిల్ ను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అర్ధరాత్రి తాగుబోతులు, ఆకతాయిలతో తమకు రక్షణ లేదని, దాడులు ఎక్కువైయ్యాయని క్యాబ్ డ్రైవర్ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడని కలిసిన ప్రజలు

కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (మే 30) : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ ముందుకు సాగుతున్నారు. గురువారం గాజులరామారం లోని తన కార్యాలయం వద్ద పలు బస్తీలకు చెందిన నాయకులు ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి స్థానికంగా నెలకొన్న పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడి, ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. పలువురు పలు ఆహ్వాన పత్రికలు అందచేశారు.



## పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం చల్లూరు గ్రామంలో పలు కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు. గ్రామానికి చెందిన బైకని బీరప్ప అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన గుంటి బాలమ్మ గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించారు.యాదగిరిగుట్ట మండలం చోల్లేరు గ్రామానికి చెందిన దొంతిసారం మితున్ ప్రమాదవశాత్తు మృతిచెందగా అతడి మృతదేహానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



## వంగపల్లి రామాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి వార్షికోత్సవంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని జీలకర్ర బెల్లం,మాంగల్య ధారణ వంటి తంతులను వీక్షించారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ కానుగు కవిత బాలరాజు గౌడ్,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మనస్తేత్రం
హైదరాబాద్
శుక్రవారం, 31 మే, 2024

## ప్రధాని చరిత్ర తెలుసుకుని మాట్లాడితే బాగుంటుంది

### తేళ్ల శ్రవణ్ కుమార్



సికింద్రాబాద్, మే 30 (వాయిస్ టుడే ప్రతినిధి): దేశ ప్రధాని నరేంద్రమోడీ ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ గురించిన చరిత్ర తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షుడు తేళ్ల శ్రవణ్ కుమార్ హితవు పలికారు. 1982లో గాంధీపై సినిమా విడుదలయ్యే కంటే ముందు మహాత్మాగాంధీ గురించి ప్రపంచానికి తెలియదని చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. గాంధీని హత్య చేసిన వ్యక్తి సైద్ధాంతిక వారసుల నోటి నుంచి ఇంతకంటే ఎక్కువ ఏం ఊహిస్తామని ఎద్దేవా చేశారు. స్వార్ధ రాజకీయాలతో ఎన్నికల్లో లబ్ది పొంది, తిరిగి అధికారం చేజిక్కించుకునేందుకు మోడీ, షా ద్వయం కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో రాజకీయం చేస్తూ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు ఈ ఓట్ల రాజకీయాలను గమనిస్తున్నారని, బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. అంబానీ, అదానీలకు తప్ప సామాన్య మానవునికి మోడీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరల పెంపు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో సాధారణ ప్రజానీకానికి బతుకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ చమురు ధర అంతే ఉందని గుర్తు చేశారు. అయినప్పటికీ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు రెట్టింపయ్యాయని విమర్శించారు. కేంద్రప్రభుత్వ తిరోగమన విధానాలతో అంతర్జాతీయంగా రూపాయి విలువ కూడా దిగజారిందని నిప్పులు చెరిగారు. ప్రధాని నరేంద్ర మోడీ ఏ దేశంలో పర్యటించినా, కొన్ని రోజుల్లోనే ఆ దేశంలో అదానికి వాణిజ్యపరంగా మేలు జరుగుతోందని, ఇది దేశాన్ని తాకట్టు పెట్టి అదానికి మేలు చేసే చర్యగా అభివర్ణించారు.

## పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణా తరగతులు

సికింద్రాబాద్, మే 30 (వాయిస్ టుడే ప్రతినిధి): ఇంగ్లీషు భాష మన నిత్యజీవితంలో భాగం అయినందున, విద్యార్థులు, యువకులు తమ జీవితంలో రాణించుట కు ఇంగ్లీషు భాషలో పట్టు తప్పనిసరి కాబట్టి, ఉన్నత చదువులు ఎక్కువగా ఇంగ్లీషు మీడియంలోనే జరుగుచునందున, విద్యార్థులు ఉన్నత విద్య మరియు ఉద్యోగంలో రాణించడానికి నిరుద్యోగ యువతీ యువకులకు తమ వంతు సహాయంగా ఎస్ఎఫ్ఐ, పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఇంగ్లీషు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు, పీపుల్ వెల్ఫేర్ ట్రస్ట్ గద్దే వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈసీఐఎల్ సౌత్ కమలానగర్ సిఐటియు ఆఫీసులో ప్రతినెల 01వ తేదీ నుండి 30వ తేదీ వరకు 30 రోజులు పాటుగా ప్రతిరోజు సాయంత్రం 6:00 గంటల నుండి 7:30 ని" వరకు నిర్వహించబడుతుందనీ విద్యార్థిని,విద్యార్థులు,నిరుద్యోగ యువత, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఇంగ్లీషు భాష నైపుణ్యాన్ని పెంపొందించు కొని జీవితంలో రాణించాలని కోరారు. సమాచారం కొరకు 9642819000,9618604620 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## సొంత వదినపై దాడి కి పాల్పడ్డ మరిది



జూబ్లీహిల్స్ 30 మే (వాయిస్ టుడే) బోరబండ పోలీస్ స్టేషన్ లోని ఎన్ ఎస్ బి నగర్ కు చెందిన జ్యోతి అనే మహిళపై మరియు: భర్త పై దాడి..మానవత్వాలు మరిచి రక్తసంబంధం పేగు బంధాన్ని కూడా లెక్కచేయకుండా కిరాతంగ మారాడు ఒక్కసారి తమ్ముడు.. అనారోగ్యంతో బాధపడుతున్న అన్న పై దాడి చేశాడు. అంతటితో ఆగకుండా ఘర్షణ జరుగుతుండగా మధ్యలో వచ్చినందుకు వదినను కూడా చితకబాదాడు ఈ సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ ఎస్ బి నగర్లో చోటు చేసుకుంది. తాగిన మైకంలో సొంత అన్న పై దాడి చేస్తుండగా మధ్యలో వెళ్లినందుకు సొంత వాళ్ళని కూడా చూడకుండా వదినపై కర్కశంగా దాడి చేసిన మరిది రమేష్. తీవ్ర గాయాలతో బోరబండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేసిన మిత్రులు



వరంగల్ మే 30 (వాయిస్ టుడే) : వరంగల్ తూర్పు దేశాయిపేట ప్రాంతానికి చెందిన ఇద్దరు పెయింటింగ్ కార్మికు లు ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించిన ఘటన చోటుచేసుకుంది. మరణించిన వారి కుటుంబాలకు గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజారపు రాజు ఆధ్వర్యంలో ఇరువురి కుటుంబాలకు పది వేల చొప్పున తోటి పెయింట ర్స్ మిత్రులు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందించిన యూని యన్ వారికి మృతుల కుటుంబ సభ్యులు ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెయింట ర్స్ యూనియన్ అధ్యక్షులు రాజారపు రాజు, ఉపాధ్యక్షులు ఎస్డి సాదిక్, గబ్బిటా ఎల్లేష్, ఈ సతీష్, ఎండి షబ్బీర్, షెడ్రేక్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, సహాయ కార్యదర్శి కట్కూరి రాజు, కోశాధికారి శ్రీకాంత్, సంయుక్త కోశాధికారి ఎండి ఖదీర్, కార్యవర్గ సభ్యులు మేకల రాజేంద ర్, తమ్ముడపల్లి రాజ్ కుమార్, హరీష్, సౌర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చనిపోయిన స్నేహితురాలి కుటుంబనికీ ఆర్థిక సహాయం



వరంగల్ మే 30 (వాయిస్ టుడే) తమతో చదువుకొన్న స్నేహితురాలు అనారోగ్యం తో చనిపోగా ఆమె తోటి స్నేహితులు ఆర్థిక సహాయం తో ఆదుకొన్నారు. ఆత్మకూరు జడ్పీఎచ్ఎస్ హై స్కూల్ 98-99 పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమతో చదువుకున్న స్నేహితురాలు పార్శ సరిత ఇటీవల చనిపోగా గురువారం నాడు ఖిలా వరంగల్‌లోని ఆమె ఇంటికి వెళ్లి వారి కూతురుకి 15 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పెద్ది సూర్య ప్రకాష్ రెడ్డి, కోల. జగన్, చుక్క. కమలాకర్ పాల్గొన్నారు.

# కెసిఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ కేసులో జైలు కెళ్లడం ఖాయం: కోట శ్రీనివాస్ గౌడ్



సికింద్రాబాద్, మే 30 (వాయిస్ టుడే ప్రతినిధి): ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలోనే కెసిఆర్ కుటుంబం జైలుకెల్లడం కాయమని ఓయూ జేఏసి,తెలంగాణ ఉద్యమ నాయకులు, టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వహకులు కోట శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. రాచరిక పోకడలతో ఉన్న రాష్ట్ర రాజ ముద్రను తొలగించి తెలంగాణ ప్రజల త్యాగాలకు చిరునామాగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రాజముద్రను ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. రాజముద్ర తో పాటు, ప్రజా ఉద్యమ ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా రాష్ట్ర గీతం ఉండేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వెళుతుంటే ఆయన పట్ల విమర్శలు చేయడం కోట శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. , ఈ మేరకు గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి ప్రజా పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణ అస్తిత్వ పోరాటానికి చిహ్నం టీజీ అని, కేసీఆర్ దాన్ని తీసేసి టిఎస్ గా పెట్టడం బాధాకరం అన్నారు. తెలంగాణలో ప్రతి ఉమ్మడి జిల్లాకి ఒక పోరాట చరిత్ర ఉందని, దానిని తుడిపేసి ఎటువంటి శాస్త్రియ పరమైన చర్చ లేకుండా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి జిల్లాల చరిత్రను, ఆస్థిత్వాన్ని కెసిఆర్ తన పాలనలో ధ్వంసం చేసాడన్నారు. కెసిఆర్ ఎంచుకున్న రాజముద్రలో, తెలంగాణ తల్లి విగ్రహంలో ఎక్కడ కూడా ప్రజల ఉద్యమ, మట్టి తల్లుల ఆనవాళ్లు ప్రతి బింభించలేదన్నారు.

తెలంగాణలో ఆణువణువూ అమరుల త్యాగల గుర్తులే కనబడతాయని, అలాంటి గుర్తులు లేని రాచరికపు పోకడలు ఉన్న రాజ ముద్ర ఎందుకని ప్రశ్నించారు. దొర అహంకారం ఒక దళితుడు రాసిన పాటను పదేండ్లు రాష్ట్ర గీతంగా లేకుండా ప్రజల్ని మభ్యపెట్టాడని చెప్పారు.గతంలో జయ జయహే గీతాన్ని రమణ అనే రాయలసీమ అతనితో కెసిఆర్ పాడించాడని గుర్తు చేశారు. గడిచిన పదేండ్లలో సీమాంధ్ర పెట్టుబడే రాష్ట్రాన్ని శాశించిందని, బీఆర్ఎస్ భవన్ కట్టే పని శ్రీకాకుళం మేస్త్రీలకిచ్చిన కేసీఆర్, సచివాలయం కాంట్రాక్ట్ మధ్యప్రదేశ్ కాంట్రాక్టర్‌కి, యాదగిరిగుట్ట పునరుద్ధరణ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయికి, కాళేశ్వరం కాంట్రాక్ట్ మేఘా కృష్ణారెడ్డికి అప్పగించారన్నారు.

ఏ ప్రాంతం అని తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ గా సమంతను పెట్టారో కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. ప్రజలు కోరుకున్నట్టుగా రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో ముందుకు పోతుంటే కుట్రలు మొదలు పెట్టారన్నారు. ఫోన్ ట్యాపింగ్ లో భుజంగ రావు ఇచ్చిన కాన్ఫెషన్ స్టేట్మెంట్ ను పక్కదారి పట్టించి , కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు లను కాపాడే ప్రయత్నంలో కొందరు యూట్యూబ్ , పేస్ బుక్లలో ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ ను దాని వెనుక ఉన్న నాయకులందరిని అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెంచాల సతీష్, వెంకట్ నాయక్, పవన్ , జశ్వంత్, కొరివి బాలకృష్ణ, నాంపల్లి వెంకటరమణ, రాము, కొంపల్లి వినయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

### జెండా ఆవిష్కరణ ప్రాంతాన్ని క్షేత్ర స్థాయి పరిశీలన



వరంగల్ మే 30 (వాయిస్ టుడే): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో చేయాల్సిన ఏర్పాట్ల పై గురువారం కమీషనర్ క్షేత్ర స్థాయి లో కార్యాలయ అవరణ లో పర్యటించి పరిశీలన చేసి సమర్థవంతంగా ఏర్పాట్లు చేయడానికి ఆధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమీషనర్ ప్రధాన ద్వారం వద్ద గల పోర్టీకో వద్దజెండా ఆవిష్కరించు ప్రాంతం తో పాటు గాంధీ విగ్రహం ప్రాంతం లో కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడుతూ వేడుకలను అట్టహాసంగా నిర్వహించడానికి కార్యాలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లు చేయాలని వేడుకలు నిర్వహించే ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కుర్చీల ఏర్పాటు తో పాటు నీడ ఉండేలా టెంట్ ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించి ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. నగర వ్యాప్తంగా ఉన్న కార్పోరేటర్లందరు ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనే విధం గా ప్రత్యేకం గా ఆహ్వానించాలని ఈ సందర్భం గా కమీషనర్ అన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ సిఎంహెచ్ ఓ డా. రాజేష్ హెచ్ ఓ రమేష్ ఈ ఈ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.



## రంగసాయిపేటలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభం

వరంగల్ మే 30 (వాయిస్ టుడే): వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగసాయిపేట శ్రీ కాశీ విశ్వేశ్వర హనుమాన్ దేవాలయంలో గురువారం నుండి మూడు రోజులపాటు నిర్వహించే హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దంపతులు భక్తులు, స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో గురువారం హనుమాన్ చందనాభిషేకం పుణ్యా వచనం మంట ఆహ్వాన పూర్వక ప్రతిష్టాపన మొదలైన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. గత 47 సంవత్సరాలుగా ఈ ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ బోలుగోడు సారయ్య, పూజారి కృష్ణమాచార్యులు, ప్రవీణ్ తోపాటు లక్కాకుల రాహుల్, దుర్గ మాత కమిటీ సభ్యులు గణపతి కమిటీ సభ్యులు హనుమాన్ మాల ధారణ భజన కమిటీ భక్తులు మొదలైన వారు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న జయంతి వేడుకలు ప్రారంభం

మల్యాల, మే 30: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అంజన్న జయంతి వేడుకల్లో భాగంగా భద్రాచలం సీతారాముల దేవస్థానం తరుపున ఈవో రమాదేవి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కళాకారులతో నిర్వహించిన శోభాయాత్రతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. అనంతరం అర్చకులు.. ఆలయంలోని ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి యాగశాల ప్రవేశం చేశారు. మూడు రోజుల పాటు యాగశాలలో త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి దాదాపు రెండు లక్షల మంది దీక్షాపరులు రానున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

# గో అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

### గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

### ఆదిత్య సాయి బజరంగ్ దళ్ సురక్షా ప్రముఖ్



వరంగల్ మే 30 (వాయిస్ టుడే) గోవధ నిషేధ చట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా కచ్చితంగా అమలు చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ గోరక్ష రాష్ట్ర శాఖ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లో మరియు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుంది. కార్యక్రమం లో భాగంగా గురువారం నాడు సుబేదారి పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్. పి సత్యనారాయణ రెడ్డి, హనుమకొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి Dr. బి రమ్యకు విశ్వహిందూ పరిషత్ గోరక్ష విభాగం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోవులను కాపాడాలి, గోవధ నియంత్రించాలి, లారీలు , డీసీఎం లలో, క్లోజ్డ్ కంటైనర్స్ ద్వారా జరిగే గోవుల అక్రమ రవాణా పై తగిన చర్యలు తీసుకోవాలని చెక్ పోస్టు ఏర్పాటు చేయాలని బజరంగ్దళ్ సురక్షా ప్రముఖ్, కొల్లూరి ఆదిత్య సాయి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారికీ ఒక విజ్ఞాపన పత్రాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇటీవల కాలంగా జిల్లాలో గోవుల అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతుందని, గోవధ నిషేధ చట్ట మున్నా అక్రమ రవాణా దారులు ఏమాత్రం భయపడకుండా ఆవులను, గేదెలను అక్రమంగా రవాణా చేస్తూ దారుణంగా, కిరాతకంగా వధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. సకల దేవతల స్వరూపం గోమాత వేద కాలం నుండి గోవును ఆరాధ్య దేవతగా భావిస్తున్నామని,మెజారిటీ ప్రజలైన హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వరంగల్ మహానగరంలో పలు చోట్ల మాంసం వ్యాపారులు మరికొందరు ఆవులను, లేగదూడలను వధించి బహిరంగ ప్రదేశాలలో రోడ్ల పక్కకు, హిందూ జనసంచార ప్రదేశాలలో 35 స్థలాలలో నగరం నడిబొడ్డున విక్రయించుచున్నారు అని తెలియజేశారు. ఆవులతో పాటు ఆరోగ్యకరంగా ఉన్న ఎద్దులు, దున్నలు గేదలు లేక దూడలను వధిస్తున్నారు అని ఆరోగ్యకరమైన పశువులను వధించకూడదని గోవధ నిషేధ చట్టం1977 చెబుతుంది అని అన్నారు.

జన సమూహాల మధ్య పశు కళేబరాల నుండి నూనె టీ పొడి లాంటివి తయారు చేసే కర్మాగారాలను ఏర్పాటు చేసి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. గ్రామాలలో దేవాలయాలకు వదిలేసిన గో సంతతిని వేలంపాట ద్వారా అన్యమతస్తులు అమ్ముతున్నారు. బక్రీద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగరాలలో గట్టి నిఘాను ఏర్పాటు చేసి ఆవులు లేగ దూడలు ఎద్దులు గోవధశాలకు తరలకుండా చూడవలసినదిగా కోరుచున్నాము. గత అనేక సంవత్సరాలుగా గో భక్తులు, గోవుల అక్రమ రవాణాను గుర్తించి ప్రభుత్వానికి పోలీసులకు తెలియజేస్తూ గోవులను రక్షించడంలో సహాయపడుతున్నాము.

మా యొక్క సహకారాన్ని ఇప్పటిలాగా స్వీకరిస్తూ వరంగల్ మహానగరం లో జరిగే గోవదను అరికట్టాల్సిందిగా, గోవులను వధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మహానగరంలోని గోవధ కేంద్రాలలో మరియు ఇండ్లల్లో లేగదూడలు ఆవులు ఎద్దులను వధించడానికి సిద్ధంగా ఉన్నారు. వాటిని ఏకకాలంలో తనిఖీలు చేసి పట్టుకొని గోవులను రక్షించాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవులను రక్షించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనియెడల విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గోరక్ష ప్రముఖ్ నంగునూరు నాగరాజు, నల్లెల వెంకటేశ్వర్లు, దుర్గా వాహిని విభాగ్ సంయోజిక సంతోషం నాగమణి, సాహసంయోజిక చిగుమల్ల మౌనిక, ధర్మాచార్య ప్రముఖ్ గూడూరు రాకేష్, బజరంగ్ దళ్ సంయోజక్ బొజ్జం సిద్దు తేజ, భవాని నగర్ ప్రకండ అధ్యక్షులు శ్రీపతి శ్రీకాంత్ గౌడ్, మఠ మందిర్ ప్రముఖ్ అనుమాండ్ల శివ కృష్ణ, బజరంగ్ దళ్ న్యూ శాయంపేట సంయోజక్ పొనుగంటి ప్రవీణ్, బైరిశెట్టి రాజేష్ శ్రీరామ్ రోహిత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును తరలిస్తే నిరాహార దీక్ష

**మహిళా అధికారిపై లేనిపోని ఆరోపణలు తగదు**

**తెలంగాణ అంబేద్కర్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చునూరి కర్ణాకర్**



భీమదేవరపల్లి వాయిస్ టుడే మే 31: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును వ్యక్తిగత కక్షసాధింపు కోసం అనవసర రాద్ధాంతం చేస్తే ఊరుకోబోమని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్చునూరి కరుణాకర్ హెచ్చరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా భీమదేవరపల్లి తాలూకా ఏర్పడినప్పటి నుండి కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నాలుగు మండలాలకు సేవలు అందుతున్నాయన్నారు. ఐదారుగురు వ్యక్తులు ఆఫీస్ వద్ద డాక్యుమెంట్లు తయారు చేసే రైటర్ల నుండి డబ్బులు వసూలుకు ప్రయత్నం చేస్తే వారు ఇవ్వనందుకు ఆఫీసునే ఇక్కడనుండి లేకుండా చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక మహిళ సీనియర్ సబ్ రిజిస్ట్రార్ పైన ఇష్టం వచ్చినట్లు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. వారి ఆగడాలకు తట్టుకోలేక ఆ మహిళా అధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం జరిగిందన్నారు. వ్యక్తులను టార్గెట్ చేసి ప్రజోపకరమైన ఆఫీసులపై అనవసర ఆరోపణలు చేయవద్దని హితవు పలికారు. సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసును తరలించే ప్రయత్నం చేస్తే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. మండల కేంద్రంలో గత బిఅర్ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు శంకుస్థాపన చేశారన్నారు. ఏండ్లు గడిచిన భవనం పిల్లర్ల దశలోనే నిలిచిపోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చొరవ తీసుకుని నిలిచిపోయిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దళిత నాయకులు చాగంటి వెంకటేశ్వర్లు ఎలకపల్లి శ్రీనివాస్ ఎలకపల్లి ఆనందం రాకేష్ లింగం కృష్ణ కుమారస్వామి రమేష్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## చందుర్తి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

వాయిస్ టుడే న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా మే 30 : రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి పోలీస్ స్టేషన్ ను గురువారం ఆకస్మిక తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలు,రికార్డుల నిర్వహణపై లోతుగా పరిశీలించారు.విధుల్లో భాగంగా పోలీసులు మెయింటేన్ చేసే రిసెప్షన్, జీడీ ఎంట్రీ తదితర రికార్డును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. మారుతున్న నేరాల నమూనాకు అనుగుణంగా గస్తీ, పేట్రోలింగ్ లను పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్లలో క్రైమ్ పాట్రాన్స్, ఫంక్షనల్ వర్టికాల్స్ పనితీరు పరిశీలించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని,ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నడుస్తున్నాయని అడిగి తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24%ఇ%7 గస్తీ నిర్వహించాలని,సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందరి దగ్గర ఉండాలని,గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. ఎస్పీ వెంట సి.ఐ వెంకటేశ్వర్లు,ఎస్.ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.



## బీసీ హాస్టల్ ను పరిశీలించిన జిల్లా అసిస్టెంట్, బిసి వెల్ఫేర్ అధికారిని

వాయిస్ టుడే న్యూస్ సిరిసిల్ల జిల్లా మే 30 : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో ఉన్నటువంటి బిసి హాస్టల్ ను పునః ప్రారంభించాలని గంభీరావుపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ మార్చి 3వ తేదీన బీసీ సంక్షేమ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి బీసీ హాస్టల్ మూతబడి ఉందని, హాస్టల్ లో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించి హాస్టల్ ను పున ప్రారంభించి ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కమిషనర్ కి వెంటనే విచారణ చేసి ఈ విద్యా సంవత్సరంలోనే బీసీ హాస్టల్ ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించడం జరిగింది. అందులో భాగంగా గురువారం బీసీ హాస్టల్ ను పరిశీలించిన జిల్లా అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారిని సంపూర్ణ మూతబడి ఉన్న బీసీ హాస్టల్ ను రాష్ట్ర బీసీ కమిషనర్ ఆదేశాలనుసారం బీసీ హాస్టల్ పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, తను స్వయంగా కలియ తిరుగుతూ ఇక్కడ ఉన్నటువంటి ఇబ్బందులపై అధికారులకు వినతి పత్రం ఇచ్చి ఈ విద్యా సంవత్సరంలోనే బీసీ హాస్టల్ పునః ప్రారంభించాలని ప్రస్తుతం హాస్టల్ భవనానికి రిపేర్ చేపించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మల్యాల రాజు, వీర్ వాసం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ -1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

## కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, మే 30(వాయిస్ టుడే )టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో జూన్ 9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. చిన్న మిస్టేక్ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం కరీంనగర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ లో 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో 34 ప్రైవేట్ విద్యాసంస్థలు, రెండు ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 18,663 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్తు, ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గట్టి నిఘా మధ్య పరీక్ష ప్రశాంతంగా పారదర్శకంగా సాగేలా చూడాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు కల్పించాలని, అభ్యర్థులను తనిఖీ చేసిన తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని పేర్కొన్నారు. బయోమెట్రిక్ హాజరు విధానం ఉంటుందని, అభ్యర్థులు జూన్ 9న ఉదయం 9 గంటలకు ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 10 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారని తెలిపారు. ఆ తర్వాత వచ్చే వారిని అనుమతించారని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తెలిపారు. టీజీపీఎస్సీ రూపొందించిన నిబంధనలను అభ్యర్థులు పాటించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఒక్కో పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బంది మందులతో అందుబాటులో ఉండాలని సూచించారు. ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నపత్రాలను గట్టి భద్రత మధ్య స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచాలని పేర్కొన్నారు. పరీక్ష జరిగే రోజున ఉదయమే ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రాలకు తగిన పోలీస్ భద్రత మధ్య తీసుకెళ్లాలని తెలిపారు. పరీక్ష ముగిసిన తర్వాత అభ్యర్థుల హాజరు, ఓఎంఆర్ షీట్ల సంఖ్యను సరిగా చూసుకోవాలని సూచించారు. ఏమైనా తేడాలు వస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఆయా కేంద్రాలకు సమయానికి చేరుకునేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అలాగే ఎక్కడ ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులు వచ్చేటప్పుడు ఏదైనా గుర్తింపు కార్డును తీసుకొని రావాలని తెలిపారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో సిబ్బంది కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష రోజున కేంద్రంలో ఎంతమంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారో లిస్టు తయారు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఏ చిన్న పొరపాటుకు ఆస్కారం ఇవ్వవద్దని, అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు వచ్చిన తర్వాత బయటకు వెళ్ళరాదని, ఇన్విజిలేటర్లు సైతం సెల్ ఫోన్లను తీసుకు వెళ్ళవద్దని తెలిపారు. టీజీపీఎస్సీ నిబంధనల మేరకు అధికారులు విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా జరిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్ఓ పవన్ కుమార్, ఆర్డీవో కే మహేశ్వర్, అడిషనల్ డీసీపీ జే కుమార్, కొండగట్టు జేఎన్టీయూ కళాశాల ప్రొఫెసర్ బీ సతీష్ కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీ చరణ్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీ శ్రీలక్ష్మి, మాస్ మీడియా అధికారి రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డే కేర్ సెంటర్‌లో ఘనంగా ఐటి శాఖ మంత్రి పుట్టిన రోజు వేడుకలు



వాయిస్ టుడే న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా మే 30: తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీదర్ బాబు జన్మదిన వేడుకలు ఎల్లారెడ్డిపేట తాజా మాజీ ఉప సర్పంచ్ ఒగ్గు రజిత యాదవ్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేటలోని డే కేర్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఆయురారోగ్యాలతో జీవించాలని,తెలంగాణ రాష్ట్రములో ఐటి రంగాన్ని అభివృద్ధి చేయాలనీ ఆమె ఆకాంక్షించారు.ఆమె వెంట ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ నాయకులు ఒగ్గు బాలరాజు యాదవ్,యూత్ కాంగ్రెస్ నాయకులు బుచ్చి లింగు సంతోష్ గౌడ్,పుల్లయ్య గారి తిరుపతి గౌడ్,గంట వెంకటేష్ గౌడ్,దీటి సతీశ్ కుమార్,గడ్డం జితేందర్, బుర్క జ్యోతి లు పాల్గొన్నారు.



## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

వాయిస్ టుడే న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా మే 30: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని గత 20 రోజులు నుండి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఫైనల్ కు చేరుకుంది. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతి కొనరావుపేట, రెండవ బహుమతి మల్యాల, వేములవాడ నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులు సందర్భంగా మల్యాల గ్రామంలో యువజన విభాగమ అధ్యక్షుడు సోదరుడు ఈర్లపల్లి రాజు తాజా మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ టోర్నమెంట్ గత 20 రోజుల నుండి మల్యాల గ్రామంలో చాలా చక్కగా ఆడిపిస్తున్నారు.మరి ఈరోజు చివరి రోజు కావడంతో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆటలో ఆడాలని క్రికెటర్ కాకుండా కబడ్డీ, కొక్కో, వాలీబాల్ రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయిలో ఆడాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించిన యువతకు క్రీడాకారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.


# ఆంధ్రుల కాలికి ముల్లు గుచ్చుకుంటే పంటితో తీస్తానని కేసీఆర్ అన్నది యాదికి లేదా ?

## బీఆర్ఎస్‌కు తెలంగాణపై సోయి ఎక్కడిది ?

వాయిస్ టుడే ప్రతినిధి సిరిసిల్ల జిల్లా మే 30:తెలంగాణ అధికారిక చిహ్నంపై, జయ జయహే తెలంగాణ గీతంపై బిఆర్ఎస్ చేస్తున్న వాటిపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం వేములవాడ పట్టణంలో మీడియా సమావేశం నిర్వహించారు.. వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన అందెశ్రీ రాసిన పాట జయ జయహే తెలంగాణ తెలంగాణ ఉద్యమ పేరుట అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పరిపాలించి విరు జయ జయ తెలంగాణ రాష్ట్ర గీతం చేయాలని సోయి లేని వారు.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జయ జయహే తెలంగాణ గీతాన్ని తెలంగాణ రాష్ట్ర గీతంగా చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించి జూన్ 2న ప్రకటించడానికి నిర్ణయం తీసుకొని రచయిత కవి అందెశ్రీ కి స్వర కల్పన రూపకల్పన చేయమని ఇస్తే ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణికి ఇస్తే తెలంగాణ గీతం, చిహ్నంపై అసవసర రాద్ధాంతానికి అవకాశం ఇస్తున్నారు. తెలంగాణ గీతం గురించి ఎందుకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఆర్తి, గుండెతడి తెలిసిన అణగారిన వర్గానికి చెందిన అందెశ్రీ గీతానికి రాష్ట్ర ప్రభుత్వం పట్టాభిషేకం చేస్తుంటే సహించ లేకనే కొత్త రగడ చేస్తున్నారు.

**జయజయహే గీతానికి**
**ప్రశస్త్యం దక్కకుండా యాగి చేస్తున్నారు.**

ఆంధ్ర మూలాలు వున్న వ్యక్తి మ్యూజిక్ కంపోజ్ చేస్తే తెలంగాణ పాట మైల పడుతదా? స్వరాష్ట్రంగా ఏర్పాటై పదేల్లు అయినాకా కూడా ఇంకా ప్రాంతీయ పంచాయితి దేనికి?ఎవరితో స్వర కల్పన చేయించాలో రచయిత అందెశ్రీ ఇష్టం. రచయితకు స్వేచ్ఛ ఉండోద్దా.ఈయనతోనే మ్యూజిక్ కొట్టించాలి. ఆయనతోనే చేయించాలి అని చెప్పడానికి మీరేవరు. ఇది దొరగడిల పాట కాదు..మిరు చెప్పినట్లు గానం చేయడానికి. దొరలను దిగంతాలకు తరిమిన మట్టి మాట. మీ మరుగుజ్జు వాదన ను మానుకోండి. తెలంగాణ వాదం అంటే సంకుచిత భావాల సమాహారం కాదు..విశాల



దృక్పథం. అందుకే అందేశ్రీకి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. పొట్టకూటీ కోసం వచ్చిన వాల్లతో తెలంగాణకు పంచాయితి లేదు..పొట్ట కొట్టే వాల్లతోనే పంచాయితి అని ఉద్యమంలో మనం చెప్పుకున్నాం కదా..ఆ సోయి ఎక్కడ పోయింది. అస్కార్ అవార్డు గ్రహిత ఎం ఎం కిరవాణి...ఆంధ్ర తల్లిదండ్రులకు పుట్టి ఉండవచ్చు. ఏనాడైనా తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించాడా..సమైక్య రాగం ఆల పించడా? కలలకు ఎల్లలు లేవు..హద్దులు సరిహద్దులు అసలే లేవు. ప్రత్యేక తెలంగాణ తనకు తానుగా సొంత అధికారిక గీతాన్ని ఆమోదించుకుంటున్న సందర్భం. మంచి పండగ రోజు. ఈ పండగ రోజున మన రాజకీయ వివాదాలను పక్కన పెడుతాం. యావత్ తెలంగాణ ఒక్కటే అనే నీతిని జగానికి చాటుదాం.

**అయినా బీఆర్ఎస్‌కు తెలంగాణ సోయి ఎక్కడిది?**

యాదాద్రి ఆర్కిటెక్ట్ గా ఆంధ్ర సాయిని నియమించినప్పుడు ఎక్కడ పోయింది మీ పౌరుషం?

ఆంధ్రుల కాలికి ముల్లు గుచ్చుకుంటే పంటితో తీస్తానని కేసీఆర్ అన్నది యాదికి లేదా?

ఆంధ్ర కోడలు సమంతను తెలంగాణ చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా, ఆంధ్ర అమ్మాయి మంచు లక్ష్మిని తెలంగాణ స్వచ్ఛభారత్ బ్రాండ్ అంబాసిడర్ గా, రాష్ట్రానికి సంబంధం లేని రకుల్ ప్రీత్ ని బాలిక విద్యకు బ్రాండ్ అంబాసిడర్ గా కేటీఆర్ నియమించినప్పుడు.. తెలంగాణ సోయి లేదా? ఉద్యమంలో వేనోళ్ళ పాడిన జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం అన్న గేయాన్ని కటిక దరిద్రంలో పుట్టి తన స్వరాన్ని... స్వరాష్ట్రం కోసం మండించిన తెలంగాణ బిడ్డ అందెశ్రీ. అందెశ్రీ కి ఎక్కడ గౌరవం దక్కుతుందో అన్న దుర్బుద్ధి తో రాష్ట్ర గేయం గా పెట్టకుండ తొక్కిపట్టిండు కెసిఆర్. అలాంటి గేయానికి కాంగ్రెస్ సర్కార్ పబ్బతి పడితే..కెసిఆర్ అండ్ కో కి ఎందుకు నొప్పి?కాంగ్రెస్ ప్రభుత్వం అందెశ్రీ గేయాన్ని రాష్ట్ర గేయంగా ప్రకటిస్తుంది. దాన్ని తట్టుకోలేక పక్కదారి పట్టించే ప్రయత్నంలో భాగంగానే ఉద్యమంలో కిరవాని ఆంధ్ర అని కొర్రీలు పెడుతున్నారు..

**తెలంగాణ అధికారిక చిహ్నంపై వివాదం ఎందుకు..**

రాచరికపు ఆనవాల్లు లేకుండా.. తెలంగాణ తిరుగుబాటు తత్వం, శ్రమైక జీవన విధానం, ఒక్కడి మట్టి మనుషుల పోరాటాలు, అస్థిత్వ ప్రతీకలకు ప్రతిబింబంగా..తెలంగాణ చిహ్నాన్ని ప్రజలు, ఉద్యమకారులు, మేదావులు, ప్రజా సంఘాల ఆకాంక్షల మేరకు రూపుదిద్దుకుంటుంది.

కాకతీయ కళాతోరణం, చార్మినార్ లు తెలంగాణ కు తీపి గుర్తులే. కాని చిహ్నాన్ని ఆ రెండు గుర్తులకు పరిమితం చేయడం సరికాదనే భావన ఉంది. అందుకే చిహ్నాన్ని మరింత విస్తృత పరుస్తుంది ప్రభుత్వం. దాంట్లో కూడా రాజకీయం ఎందుకు?కాకతీయ కళాతోరణం, చార్మినార్ అంటే గౌరవం ఉంది. కానీ ప్రభువెక్కిన పల్లకి కాదోయ్, అది మోసిన బోయీ లెవ్వరు? అనే చరిత్ర మనకు ఇప్పుడు కావాలి. వేటగాడి చరిత్ర ఒక్కటే చరిత్ర కాదు..గాయ పడ్డ లేడి పిల్ల చరిత్ర కూడా చదవాలి. అందుకే తెలంగాణ కీర్తి, ఆర్తి, పోరాటం, చైతన్య ప్రతికలకు చిహ్నంలో స్థానం కల్పిస్తున్నాం..అధికారం పోయాక కేటీఆర్ కెసిఆర్ తెలంగాణ ప్రజలపై వలకబోస్తున్న ప్రేమను ప్రజలంతా గమనిస్తున్నారు.. తెలంగాణ ప్రజలపై ఇంత ప్రేమ వలకబోస్తున్న మీరు అసలు మీ పార్టీ నుండి తెలంగాణ పదం ఎందుకు తీసివేసీ భారత రాష్ట్ర సమితిగా ఎందుకు మార్చారో ప్రజలకు సమాధానం చెప్పాలి. మీరు మీ పార్టీ నుండి తెలంగాణ పాదం తీసివేసినప్పుడే తెలంగాణ ప్రాంత ప్రజలతో పేగు బంధం తెంపుకున్నారు.. అందుకే మొన్నటి ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మీకు తగిన బుద్ధి చెప్పారని అన్నారు.

# కొత్తగూడెం ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే 30) గురువారం న రుద్రంపూర్ ఆర్.సి.ఓ.ఏ క్లబ్ నందు వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంను కొత్తగూడెం ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. సింగరేణి వ్యాప్తముగా 11 ఏరియాలలో ప్రతీ ఏడాది నిర్వహించే సమ్మర్ క్యాంప్ లలో భాగముగా ఈ ఏడాది కూడా సింగరేణి కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యం లో 2024-25 సంవత్సరంకు గాను 18 సంవత్సరాల లోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు (బాలురు బాలికలకు) మరియు కొత్తగూడెం పరిసర ప్రాంతాల పిల్లలకు ఈ నెల 26 వ తారీఖు నుండి 20.05.2024 వరకు అనుబవజ్ఞులైన శిక్షకులచే సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించడం జరిగింది.

ఈ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు పాల్గొనడం జరిగింది. సందర్భంగా వారు ఈ ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ చదువులతో పాటుగా చిన్నారులకు క్రీడాల యందు కూడా ప్రావీణ్యం ఉండాలని ప్రతి ఒక్కరికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని అలాగే ఈ శిక్షణ శిబిరంలో తీసుకున్న శిక్షణను తర్వాత కూడా అభ్యాసంలో ఉంచుకొని వారు మెరుగైన స్థాయిలో క్రీడలలో ప్రదర్శనలు చేయాలని అలాగే క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక దారుఢ్యానికి ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి అందువల్ల పిల్లలలో క్రీడా స్ఫూర్తితో పాటు వ్యక్తిగత వికాసాన్ని కూడా ఉపయోగకరంగా ఉంటుందని చిన్నారులకు ఏ ఏ క్రీడలలో ప్రావీణ్యం ఉందో అట్టి క్రీడలను ఆసక్తిగా నేర్చుకొని ప్రావీణ్యం సాధించి ఉన్నత స్థాయిలను చేరుకోవాలని అన్నారు.

అనంతరం ఈ ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొని శిక్షణ పొందిన చిన్నారులకు క్రీడ దుస్తులను బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిఎం తో పాటు పర్సనల్ మేనేజర్ బి.శివకేశవరావు, హానర్బుల్ సెక్రెటరీ డివై. పిఎం. ఎం శ్రావణ్ కుమార్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జే.శంకర్, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జే. గట్టయ్య, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సిహెచ్ సాగర్ కే.శ్రీనివాసరెడ్డి, అజ్మీర మహేష్ క్రీడలకు శిక్షణ ఇచ్చు శిక్షకులు క్రీడలను నేర్చుకొనుటకు వచ్చిన పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## చేర్యాల ప్రాంత విద్యార్థులకు పూర్తిగా అన్యాయం

**చేర్యాల ప్రాంతానికి సంబదించిన భవనంను నర్మేట గురుకుల పాఠశాల కేటాయించడం సిగ్గు చేటు**

**ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి**

వాయిస్ టుడే మే 31( సిద్దిపేట జిల్లా ప్రతినిధి): సిద్దిపేట జిల్లా చేర్యాల భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ చేర్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి మాట్లాడుతూ చేర్యాలకు నర్మేట గురుకుల పాఠశాల తీసుకురావడం సిగ్గు చెటని వారు తెలియజేశారు. గతంలో ఉన్న గర్ల్స్ రెసిడెన్షియల్ దానిని మిట్టపల్లి కి తరలించి ఇప్పుడు నర్మేట గురుకుల విద్యార్థులకు న్యాయం చేసి చేర్యాల పట్టణంలో ఉన్న విద్యార్థులను మోసం చేస్తున్నారని తెలియజేశారు చేర్యాల ఎస్సీ హాస్టల్ సంత భవనం లేదని పలుమార్లు కలెక్టర్ కి విన్నవించమని చేర్యాల విద్యార్థులకు వసతులు కల్పించకుండా వేరే జియా విద్యార్థులకు ఎలా హలట్ చేస్తారని ప్రశ్నించారు దీనిపైన జిల్లా కలెక్టర్ స్పందించి చేర్యాల ప్రాంత విద్యర్థులకు న్యాయం చేయాలని కోరారు లేని యెడల చేర్యాల ప్రాంతంలో ఉన్న విద్యార్థులు ఐక్యం చేసి జిల్లా అధికారుల కార్యాలయం ముందు విద్యార్థులతో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు విద్యార్థులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తెలియజేశారు తక్షణమే జిల్లా అధికారులు కలెక్టర్ స్పందించండి నర్మెద గురుకుల పాఠశాలను రద్దు చేసి చేర్యాల విద్యాసంలో దాని కేటాయించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు రాకేష్ రెడ్డి,మహేష్,అనిల్ ,మహేష్ తదితరులు పాల్గొన్నారు



## ప్రజా అవసరాలకు ఉపయోగపడే అభివృద్ధిని ఎవరైనా అడ్డుకుంటే ఉపేక్షించేది లేదు

**జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**

ఎల్బీనగర్ మే 30(వాయిస్ టుడే) మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధిలోని సి ఎస్ ఆర్ కాలనీ నుండి మొదలైన ట్రంక్ లైన్ పనులను గ్రేట్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ & స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కాలనీ సంక్షేమ సభ్యులు తో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సి ఎస్ ఆర్ కాలనీ నుండి మొదలైన ట్రంక్ లైన్ పనులు దాదాపు 10 నుండి 15 కాలనీల వరకు పైగా ఉపయోగపడే ట్రంక్ లైన్ పనులలో ఆటంకాలు కలిగించి మధ్యలో పనులు ఆపేయడంతో సంబంధిత జలమండలి అధికారులతో చర్చించి పోలీసు,రెవెన్యూ తో అనుమతులు తీసుకొని పై అధికారులతో మాట్లాడి మళ్లీ పనులను ప్రారంభించి స్వయంగా పరిశీలించడం జరిగింది అని అన్నారు. అదేవిధంగా వివిధ కాలనీవాసులు నకిలీ జర్నలిస్టుల అని చెప్పుకొని జరిగే పనులలో ఆటంకాలు కలిగిస్తున్నారు, ఇకపై అలాంటివి మళ్లీ సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కావున ప్రతి ఒక్కరు జరగుతున్న పనులకు సహకరిస్తూ మిగిలి ఉన్న డ్రైనేజ్ సమస్యను పరిష్కరించుకుందామని తెలియజేశారు. అదేవిధంగా ఏదైనా సమస్య వస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీవాసులు , బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రషీద్ అలీ ఖాన్‌కు విరమణ సన్మాన సభ



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే 30) కోర్టు సూపరింటెండెంట్ రషీద్ అలీ ఖాన్ కు పదవి విరమణ సందర్భంగా జిల్లా కోర్టు లో ఘన సన్మానం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణం లోని మీటింగ్ హాల్లో సూపరింటెండెంట్ గా పనిచేసిన రషీద్ అలీ ఖాన్ గురువారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, కోర్ట్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మార్చ్ 1983 వ సంవత్సరంలో స్టేనో గ్రాఫర్గా కోర్టులో జాయిన్ అయ్యాడు. 27 సంవత్సరాలు అప్రతీహత తంగా పనిచేశాడు. ఆ తదుపరి కోర్టు సూపరింటెండెంట్ గా ప్రమోషన్ వచ్చి, మణుగూరు కోర్టులో, కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో, ఖమ్మం ఎస్సీ ఎస్టీ స్పెషల్ కోర్టులో,,ఖమ్మం సబ్ కోర్టులో,కొత్తగూడెం సబ్ కోర్ట్ లో పనిచేస్తూ మే 2017 న రిటైర్ అయ్యారు. ఆ తదుపరి 5నపు జిల్లా కోర్టు కొత్తగూడెంలో డిసెంబర్ 2018 లో కాంట్రాక్ట్ బేసిస్ పై సూపరింటెండెంట్ గా జాయిన్ అయ్యారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆవిర్భవించి, మొదటి అదనపు జిల్లా కోర్టులో సూపరింటెండెంట్ గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో సూపరింటెండెంట్ చేస్తూ పదవి విరమణ చేశారని, నిబద్ధతతో ప్రాంప్ట్ గా పని చేసే వారని స్టాఫ్ అందరికీ మార్గదర్శకులు అయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి రమేష్,దీకొండ రవి, లగడపాటి సురేష్, మీనా కుమారి,ఉష,బి. సిద్ధార్థ,సాయి కృష్ణ,ప్రణవి, రామ్ కుమార్,స్రవంతి,పుష్ప, అన్వర్, ఈ కోర్ట్స్ సిస్టమ్ ఆఫీసర్ నరేష్, మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

## లొంగిపోయిన నిషేధిత సిపిఐ మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యులకు రివార్డులను అందజేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే 30) ఇటీవల జిల్లా పోలీసులు ఎదుట లొంగిపోయిన ఏటూర్ నాగారం-మహాదేవపూర్ ఏరియా కమిటీ సభ్యుడైన కోవాసి గంగాఏమహేష్ఏజనార్ధన్ మరియు అతడి భార్య సోడి ఉంగిఏఝాన్సీ లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంజూరైన రివార్డులను ఈరోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తమ చేతుల మీదుగా అందజేశారు.వీరిద్దరూ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో ఏరియా కమిటీ సభ్యులుగా పనిచేస్తున్న సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీరికి ఒక్కొక్కరిపై నాలుగు లక్షల రూపాయల రివార్డును ప్రకటించడం జరిగింది.ప్రత్యేక చొరవ తీసుకొని లొంగిపోయిన వీరిద్దరికీ ప్రభుత్వం తరఫున రావాల్సిన రివార్డు నగదును ఎస్పీ రోహిత్ రాజు అందజేశారు. జిల్లా పోలీసులు చేపట్టిన "ఆపరేషన్ చేయూత" కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోయిన మావోయిస్టులకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలియజేసారు.లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసంతో పాటు ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించడానికి జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని అన్నారు.నిషేధిత మావోయిస్టు పార్టీలో పనిచేసే చాలా మంది సభ్యులు లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ,చర్ల సీఐ రాజువర్మ,ఎస్సై నర్సిరెడ్డ తదితరులు పాల్గొన్నారు.



## విద్యాధికారిని సన్మానించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్

చేవెళ్ల...మే30(వాయిస్ టుడే)రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అధ్యక్షతన 2024 విద్య సంవత్సరానికి 10/10 జి పి ఏ ను సాధించిన విద్యార్థులకు మరియు పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు,శంకర్ పల్లి మండలం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టంగుటూరు లో 100 శాతం ఉత్తీర్ణత ను సాధించిన పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలైన ఉషారాణి సన్మానం చేశారు. చేవెళ్ల మండలంలో ఉన్న తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇద్దరు బాలికలను సాయి మనోజ్ఞ, జోష్ణ 10/10జి పి ఎ ను సాధించిన విద్యార్థిలను మరియు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులను, వీరితో పాటు రెండు మండలాలకు విద్యాధికారి అయిన సయ్యద్ అక్బర్ జిల్లా కలెక్టర్ మరియు అదనపు కలెక్టర్ సన్మానించారు. వచ్చే విద్య సంవత్సరములో ఎక్కువ మంది విద్యార్థులు 10/10జి పి ఎ ను సాధించే విధంగా మండల విద్యాధికారి అజమాయిషీ చెయ్యాలని సూచించారు.



## ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

**పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు**

కరీంనగర్ టౌన్, మే 30 ( వాయిస్ టుడే): రాష్ట్ర ఐటి పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని ఇందిరా చౌక్ వద్ద సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న శ్రీధర్ బాబు పదవికి వన్నె తెచ్చే విధంగా కృషి చేస్తున్నారని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.కీర్తి కుమార్, కొట్టే ప్రభాకర్ ఆధ్వర్యంలో ఖారా?న గడ్డ వృద్ధాశ్రమంలో బ్రెడ్ మరియు పండ్లు పంపిణీ చేశారు.అబ్దుల్ రెహమాన్, లయక్ ఖాద్రీ, మతీన్ ఆధ్వర్యంలో ఖరీముల్లాషా దర్గాలో ఛాదర్ మరియు ప్రార్థనలు జరిపించారు. పోతారపు సురేందర్ ఆధ్వర్యంలో మాతాశిశు ఆసుపత్రిలో అల్పాహారం మరియు టవర్ సర్కిల్ వద్ద సల్ల ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం జరిపారు. మారంపల్లి లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో శాతవాహన యునివర్సిటీ వద్ద కేక్ కట్ చేశారు.నాఖా చౌరస్తా వద్ద ఖంరొద్దిన్, బషీర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్,ఎండి తాజ్,శ్రవణ్ నాయక్, ఆకారపు భాస్కర్ రెడ్డి,ఎండి చాంద్,సమద్ నవాబ్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,జీడి రమేష్,కర్ర రాజశేఖర్,బత్తినీ చంద్రయ్య, దీకొండ శేఖర్, షబానా మహమ్మద్, ముల్కల కవిత,జ్యోతి రెడ్డి, తిరుమల, హసీనా,మెతుకు కాంతయ్య,కుర్ర పోచయ్య, శేహెన్ష,నిహాల్ అహ్మద్, ఇమ్రాన్, అష్రఫ్, రాజ్ కుమార్,మంద మహేష్, యోన,హనీఫ్, అజయ్, మిరాజ్,పెద్దిగారి తిరుపతి, మామిడి సత్యనారాయణ రెడ్డి,సతీష్ రావు,భరత్ పాల్గొన్నారు.



## జూన్ 10న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ రక్షణకై జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్చార్జి శ్రీను నాయక్**

షాద్ నగర్ /వాయిస్ టుడే /మే 30: జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం రక్షణ అమలు చేస్తున్న తీరుపై జూన్ 10వ తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం షాద్నగర్ నియోజకవర్గ ఇన్చార్జి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్ అన్నారు గురువారం నాడు ఆయన ఫరూక్నగర్ మండలంలోని కాశిరెడ్డి గూడ గ్రామంలో ఉపాధి పని చేస్తున్న ప్రదేశంలో వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ రాను రాను ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడానికి ప్రయత్నం చేస్తుందని దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం మన పైన ఎంతైనా ఉన్నది అన్నారు కాబట్టి ప్రజలందరూ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలన్నారు ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ సహాయ కార్యదర్శి రాజ్యసభ సభ్యులు శివ దాసన్ మరియు తెలంగాణ గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మరియు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య కార్యదర్శి వెంకట్ రాములు సదస్సు కు వస్తున్నట్టు ఆయన తెలిపారు కార్మికులకు కనీస పని దినాలు 200 రోజులు పెంచాలని రోజు కొలతలు లేకుండా కూలి 600 వేతనం ఇవ్వాలని వారం వారం కూలి డబ్బులను చెల్లించాలని పని ప్రదేశంలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మెడికల్ కిట్టు సౌకర్యం కల్పించాలని పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే ఐదు లక్షల ప్రమాద భీమ కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నుండి ఇంకా రావాల్సిన హక్కులకై ఉద్యమించాలని అందుకోసం జరుగుతున్న వ్యవసాయ కూలీల రాష్ట్ర సదస్సులో ప్రజలు విద్యావంతులు మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ కూలీలు రాజు అంజయ్య వీరయ్య మంజుల సువర్ణ యాదమ్మ పార్వతమ్మ అలివేలు మంగమ్మ పద్మమ్మ బుచ్చమ్మ మాధవి చెన్నమ్మ చంద్రమ్మ దీప రత్నమ్మ కే అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## నిందితున్ని కఠినంగా శిక్షించాలి

**యువ సత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్**

**పోలీసులకు వినతిపత్రం సమర్పణ**

షాద్ నగర్ /వాయిస్ టుడే /మే 30: కందివనం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని మానసను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఈ వ్యవహారంలో నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యువసత యూత్ షాద్ నగర్ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం షాద్ నగర్ పట్టణ పోలీసు స్టేషన్లో వినతిపత్రం సమర్పించారు. నిందితుడి పట్ల కఠినంగా వ్యవహరించాలని హత్య చేసి ఆత్మహత్యగా నమ్మించాడని లక్ష్మణ్ కుమార్ పోలీసులకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్లో ఎస్సై శరత్ కు వినతి పత్రం సమర్పించారు..

వాయిస్ టుడే
హైదరాబాద్
శుక్రవారం, 31 మే, 2024




## సిఐటియు 54వ ఆవిర్భవ దినోత్సవ సందర్భంగా

# నూతన సిఐటియు జెండాలు ఎగరవేసిన అల్లి దేవేందర్

చేవెళ్ల..మే30(వాయిస్ టుడే) షాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో నూతన సిఐటియు జెండాలను ఎగురవేసి ,నాగర్ కుంట గ్రామంలో గ్రామపంచాయతీ యూనియన్ షాబాద్ మండల అధ్యక్షుడు సత్తయ్య ఆధ్వర్యంలో సిఐటియు జెండాను ఆవిష్కరించడానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు ఏర్పడి నేటికీ 54 సంవత్సరాలు పూర్తి చేసుకుందని గత 54 సంవత్సరాలుగా కార్మికుల కోసం అనేక పోరాటాలు నిర్వహించి కార్మికుల సంక్షేమం కోసం కట్టుబడి అనేక పోరాటాలు చేసిందన్నారు. ముఖ్యంగా కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం శ్రమకు తగిన వేతనం తదితర డిమాండ్ల కోసం ప్రభుత్వాలతో వీరోచితంగా పోరాడి కార్మికుల హక్కులు సాధించిందన్నారు. అలాగే కక్కులూరు కేసారం గ్రామంలో నూతన సిఐటియు జెండాలను ఆవిష్కరించి,సిఐటియు కార్మికుల సంక్షేమం కోసం పాలకవర్గాలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు సత్తయ్య ,నరసింహ, సిహెచ్ నరసింహ, మల్లయ్య కవిత, సుజాత నరసింహ రమేష్ రామచంద్రయ్య ,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## రోడ్లు ఇలా ఉంటే ప్రయాణాలు చేసేది ఎలా ?

### శిథిలమైన గ్రామీణ రోడ్లు

### ప్రయాణికులకు తీరని అవస్థలు

వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా మే 30 : జడ్చర్ల, నియోజకవర్గంలో వివిధ మండలాల్లో రోడ్లు ఇలా ఉంటే ప్రయాణాలు చేసేది ఎలా అని వాహన దారులు ప్రశ్నిస్తున్నారు. జడ్చర్ల నియోజకవర్గం మండలంలో గ్రామీణ రోడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. శిథిలమైన గతుకుల రోడ్లపై ప్రయాణాలు చేయడం వాహన చోదకులకు గగనంగా మారింది.దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లు ఆలనా పాలనలేక పోవడంతో శిథిలావస్థకు చేరుకుని వాహనాల ప్రయాణాలకు ఏ మాత్రం పనికిరాకుండా పోయాయి. గత ప్రభుత్వ హయాంలో నూతన రోడ్ల నిర్మాణానికి ఇచ్చిన ప్రాధాన్యత పాత రోడ్ల మరమ్మతులకు ఇవ్వకపోవడంతో అవి పూర్తిగా శిథిలమయ్యాయి. ఆ రోడ్లపై ప్రయాణాలు చేయడానికి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు.ఎమ్మెల్యేగా అనిరుద్ రెడ్డి ఎన్నికైన వెంటనే గ్రామీణ రోడ్ల పునర్నిర్మాణాల నిమిత్తం, నూతన రోడ్ల నిర్మాణాల నిమిత్తం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం అందుకు సంబంధించిన నిధుల మంజూరికి అంగీకరించింది.ఆ నిధులతో పనులు శరవేగంగా నిర్వహించి నియోజక వర్గంలోని గ్రామీణ రోడ్లనన్నింటిని సుందరీకరించాలనే తాపత్రయంతో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ముందుకు సాగుతున్నారు.ఎమ్మెల్యే హామీపై మండలో ప్రజలు గంపెడాశతో రోడ్ల నిర్మాణాల కోసం ఎదురుచూస్తున్నారు.

# నేడు ఐసీఎంలో ప్రోగ్రాం అడ్వైసరీ కమిటీ సమావేశం

### వివరాలు వెల్లడించిన స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ యస్ఎల్ఎన్ శ్రీనివాస్

సైదాపూర్ :(వాయిస్ టుడే ):2024-25ఆర్థిక సంవత్సరంలో భారత ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రములో ఉన్న సహకార సంస్థలలో మానవ వనరుల అభివృద్ధికీ అవసరమైన అవగాహనా,శిక్షణ కార్యక్రమాలను గుర్తించి వాటిని అమలు చేయటానికి సంస్థల వారీగా ప్రణాళికలు రూపొందించటానికి ప్రోగ్రామ్ అడ్వైసరీ కమిటీ సమావేశంను నెల 31న శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని స్టేట్కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.ఈ సమావేశం తెలంగాణ రాష్ట్ర సహకార సంఘముల రిజిస్ట్రార్ హరిత ఐఏఎస్ అధ్యక్షత వహిస్తారని, సంస్థ డైరెక్టర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారని,సమావేశానికి రాష్ట్రములోని వివిధ సహకార శాఖల ఆధిపతులు,సిబ్బంది పాల్గొనున్నారని డాక్టర్ యస్. ఎల్.ఎన్. టి. శ్రీనివాస్ వివరించారు.

## జాతీయస్థాయి క్రీడల్లో కానిస్టేబుల్ ప్రతిభ



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మే 30 2024 (వాయిస్ టుడే) : జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో బెల్లంపల్లికి చెందిన సిఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్లో ఈనెల 22 నుంచి 24వరకు పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ మాస్టర్స్ గేమ్స్ మొదటి ఫెడరేషన్ కప్ పోటీలు నిర్వహించారు. సమ్మయ్య 50ఏళ్ల విభాగంలో షార్ట్ ఫుట్, త్రోబాల్ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించాడు. దీంతో పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

# అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించిన డైరక్టర్ (పా) & ఆపరేషన్స్ ఎన్వికే శ్రీనివాస్



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే 30) సింగరేణి అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ ల అధిపతులతో గురువారం నాడు కొత్తగూడెం ఇల్లందు క్లబ్ నందు జనరల్ మేనేజర్(పర్సనల్) ఐఆర్ & పిఎం ఆధ్వర్యం లో సమీక్షను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా సింగరేణి డైరక్టర్ పర్సనల్ & ఆపరేషన్స్ ఎన్వికే శ్రీనివాస్ హాజరై ఏరియాల వారీగా సమీక్షను నిర్వహించటం జరిగింది.

ఈ సంధర్భముగా సింగరేణి డైరక్టర్ పర్సనల్ & ఆపరేషన్స్ ఎన్వికే శ్రీనివాస్ గ్రీవెన్స్ మానిటరి సిస్టమ్, విధులకు గైర్హాజరు అయ్యే కార్మికుల డిసిప్లీనరి ప్రొసీడింగ్స్, పెండింగ్ లో ఉన్న కోర్టు కేసులు, కారుణ్య నియమకాలు, ఆన్లైన్ ద్వారా సిఎంపిఎఫ్ క్లెయిమ్స్ ను త్వరగతిన సెటిల్ చేసే విధానం, సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డ్, పెండింగ్లో ఉన్న SC/ST బ్యాక్లాగ్ టైమ్-రేటెడ్ ఖాళీల భర్తీ మరియు ఉద్యోగుల వారి కుటుంబ సభ్యుల వివరాలను మరియు వారి యొక్క ఫోటోలను స్కాన్ చేసి ఈపియఆర్ నందు పొందుపరిచే డిజిటలైజేషన్ వంటి అంశాలపై ఏరియాల వారీగా సమీక్షించారు.

అనంతరం మాట్లాడుతూ విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించి విధుల నుండి డిస్మిస్ అవ్వకుండా చూడాలని, కోర్టు కేసులకు సంబంధించి ప్రతి డేటాను మరియు ప్రతీ ఉద్యోగి యొక్క వివరాలను ఆన్లైన్ లో పొందు పరచాలని, ఉద్యోగుల క్వార్టర్స్ వివరాలను ఎస్ఏపిత నందు పొందు పరచాలని, సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డుల లైఫ్ సర్టిఫికేట్ సమర్పించని వారికి వారి ఫోన్ నెంబర్ కి మెసేజ్ ద్వారా సమాచారం అంధించాలని, ఉద్యోగులు ఇచ్చే గ్రీవెన్స్ ను పోర్టల్ లో పొందుపరచి వాటిని త్వరితగతిన పరిష్కరించి వాటి యొక్క స్థితి గతులను ఎప్పటికప్పుడు పోర్టల్ లో పొందుపరచాలని తెలిపారు. అనంతరం సింగరేణి సంస్థ లో పర్సనల్ డిపార్ట్ మెంట్ సుధీర్ఘ సేవలు అంధించి జనరల్ మేనేజర్(పర్సనల్) ఐఆర్ & పిఎంగా పదవీ భాధ్యతలు నిర్వహిస్తూ ఈ నెల 31 వ తారీఖున పదవీ విరమణ పొందుతున్న బి.హనుమంత రావు ని సింగరేణి డైరక్టర్ పర్సనల్ & ఆపరేషన్స్ ఎన్వికే శ్రీనివాస్ అన్ని ఏరియా ల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు శాలువా, పుష్పగుచ్చం జ్ఞాపికతో ఘనముగా సత్కరించి బి.హనుమంత రావు పర్సనల్ డిపార్ట్మెంట్ కి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరక్టర్ పర్సనల్ & ఆపరేషన్స్ ఎన్వికే శ్రీనివాస్, జిఎం(పర్సనల్) ఐఆర్&పిఎం బి.హనుమంత రావు, జనరల్ మేనేజర్(సెక్యూరిటీ)/ జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ & ఆర్సి బిఆర్ ధీక్షితులు, జిఎం(పర్సనల్) ఈఈ & సిఎస్ఆర్ కవితా నాయుడు, జిఎం(ఎఫ్&ఏ) ఎం.సుబ్బా రావు, కార్పొరేట్ పర్సనల్ డిపార్ట్మెంట్ 11 ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులు సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు విత్తనాలు సరఫరా చేయాలి...




మక్తల్ మే 30 వాయిస్ టుడే ప్రతినిధి: 2024 ఖరీఫ్ సీజన్ కు అవసరమైన నాణ్యమైన విత్తనాలు ఎరువులు 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేయాలని మక్తల్ తాసిల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ విషయం స్థానిక తాసిల్దార్ తో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన రైతుల తమ పొలాలు చదును చేసి విత్తనాలు వేసుకున్నటకు సిద్ధంగా ఉన్నారు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు వ్యవసాయ పరికరాలు పై 50% సబ్సిడీ ఇవ్వాలి దళిత గిరిజన సన్న కారు రైతులకు ఉచితంగా ఇవ్వాలి పచ్చ రొట్టె విత్తనాలు సంబంధించి జీలుగా జనుము విత్తనాలను రైతులకు సరిపడా పంపిణీ జరగడం లేదు వాటిని వెంటనే సమకూర్చాలి పంటల బీమా అమలు చేస్తూ దానికి అవసరమైన ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి పంటల నష్టాన్ని గ్రామ యూనిట్గా పంట నష్టాన్ని పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలి రెండు లక్షల రుణమాఫీ కుటుంబం యూనిట్ గా తీసుకునే విధంగా ప్రచారం జరుగుతుంది అలా కాకుండా గత వైఎస్ ప్రభుత్వం మాదిరిగా రైతు యూనిట్ గా తీసుకొని ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీ చేసి కొత్త రుణాలని రైతులకు అందించాలి రైతులు పండించిన సన్న దొడ్డు రకం వడ్లకు 500 రూపాయలు బోనస్ చెల్లించాలి స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా రైతులు పండించిన పంటలకు పెట్టుబడిపై 50 శాతం కలిపి ధరలు నిర్ణయించి మద్దతు ధరలు గ్యారెంటీ చట్టాన్ని అమలు చేయాలి రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ కు అవసరమైనటువంటి సమస్యలు పరిష్కరించుటకు మా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం విజ్ఞప్తి చేస్తుంది.పిడి ఎస్ యు.రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్.అఖిల భారత ప్రగతిశీలరైతు సంఘం మండల కార్యదర్శి పంచదేవ్ పాడు రాజు రైతు సంఘం నాయకుడు గోపాల్ భీమన్న ఆంజనేయులు రైతులు పాల్గొన్నారు.



## జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలు

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మే 30 2024 (వాయిస్ టుడే) : మంచిర్యాల గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ క్రీడా మైదానం వేదికగా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఈ మారయ్య ఆధ్వర్యంలో అండర్ 8/10/12/14/16/18/20 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులకు నిర్వహించిన జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో ఎస్ఎస్ డిఫెన్స్ అకాడమీ అథ్లెటిక్స్ బెల్లంపల్లి క్రీడాకారులు జిల్లా స్థాయిలో మెడల్ సాధించారని కోచ్ సల్పాల సంతోష్, కుమ్మరి శ్రీకాంత్ తెలిపారు. చిన్మయి, చైత్రిక స్టాండింగ్ బ్రాడ్ జంప్ గోల్డ్ మెడల్,50 మీటర్స్ పరుగు పందెంలో గోల్డ్ మెడల్, 150 పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించింది.శ్రీతిక్ 150 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఎండీ సానియా లాంగ్ జంప్ లో సిల్వర్ మెడల్, బీ.ప్రణీత 400 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించింది. ఆరాధని 400 పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించింది.నికిత 100 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్స్,సంతోష్ 400 మీటర్ల పరువు పొందడంలో గోల్డ్ మెడల్ సాధించాడు.విజయ్ 400 మీటర్ల పరుగు పందెంలో బ్రాంచ్ మెడల్ సాధించాడు. ప్రియాంక 100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్స్ సాధించారని ఎస్ఎస్ డిఫెన్స్ అకాడమీ కోచెస్ సల్పాల సంతోష్, కుమ్మరి శ్రీకాంత్ జూన్ 6,7 తేదీలలో హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో పాల్గొననున్నారని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఫెర్టిలైజర్ షాపుల్లో టాస్క్ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మే 30 2024 (వాయిస్ టుడే) : బెల్లంపల్లి పట్టణంలోని పలు ఫెర్టిలైజర్స్ షాపులను టాస్క్ ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. షాపులలోని స్టాక్ రిజిస్టర్లను, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులతో ఫోన్ ద్వారా సంప్రదించి ఖరీదు రేటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు మాట్లాడుతూ అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యమైన విత్తనాలను అమ్మాలని సూచించారు.



## ఉద్యోగి కుటుంబాన్ని పరామర్శించిన C&MD

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మే 30 2024 (వాయిస్ టుడే) : మందమర్రి సింగరేణి ఉద్యోగి కుటుంబాన్ని సంస్థ C & MD, N. బలరాం నాయక్, GM మనోహర్ పరామర్శించారు. కాసిపేట-2గని ఉద్యోగి రాజు ఇటీవల ఏరియా స్టోర్ లో జరిగిన ప్రమాదంలో మరణించాడు. సంస్థ చైర్మన్ బెల్లంపల్లి మండలం కన్నాలలోని మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారు మాట్లాడుతూ.. తన కుటుంబానికి రావలసిన అన్ని బెనిఫిట్స్, రాజు భార్యకు ఉద్యోగం తొందర్లోనే వచ్చేలాగా చూడాలని అధికారులను ఆదేశించారు.

## చిల్కానగర్లో సాయికృపా విద్యాసంస్థ 3వ బ్రాంచ్ ప్రారంభోత్సవం




వాయిస్ టుడే న్యూస్, మే 29 బోడుప్పల్ : సాయికృపా విద్యాసంస్థల చైర్మన్ కనుకుంట్ల కృష్ణమూర్తి మరియు డైరెక్టర్ స్వప్న ఆధ్వర్యంలో చిల్కనగర్ మెయిన్ రోడ్ లో గల సాయి కృప విద్యాసంస్థ 3 వ బ్రాంచి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీదేవి, రిటైర్డ్ అడిషనల్ SP శ్యామ్ సుందర్, అమృత, కాలనీ మిత్రులు ఫిలిప్స్, అంజయ్య, శ్రీనివాస్, SV6 రిపోర్టర్ లింగం యాదవ్, తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఘటనపై విచారణ




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి మే 30 2024 (వాయిస్ టుడే) : మంచిర్యాల్ జిల్లా బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ ఆదేశాల మేరకు, నిన్న రాత్రి బెల్లంపల్లి ప్రభుత్వ హాస్పిటల్ లో డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ఇంజక్షన్ వికటించి ప్రాణాలు కోల్పోయిన మంతెన లక్ష్మి కుటుంబాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించిన మాజీ మున్సిపల్ చైర్మెన్ మత్తమారి సూరిబాబు, టిపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరీ స్వామి ప్రమాదానికి గల కారణాలను ప్రభుత్వ హాస్పిటల్ సూపర్డెంట్ తో చర్చించి, నిన్న ప్రమాదం జరిగిన సమయంలో విధులు నిర్వహిస్తున్నటువంటి డాక్టర్ నర్స్ సిబ్బందిని సూపర్డెంట్ తో పిలిపించి, బెల్లంపల్లి తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్ సిఐ బెల్లంపల్లి రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సమక్షంలో హాస్పిటల్ సూపర్డెంట్ మరణించిన మహిళ కుటుంబ సభ్యుల అందరి సమక్షంలో ప్రమాదానికి గల కారణాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రమాదవశాత్తు మరణించిన మహిళ కుటుంబ సభ్యులతో హాస్పిటల్స్ సూపర్డెంట్ కి రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కు ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో విచారణ జరిపించి మరణించిన మహిళ కుటుంబాలకి న్యాయ%శీ% చేయాలని, నిర్లక్ష్యం వహించిన హాస్పిటల్ సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదు చేయడం జరిగింది, ఎమ్మెల్యే చరవాణి ద్వారా మరణించిన కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం నుంచి తప్పకుండా తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం హాస్పిటల్ సూపర్డెంట్ తో ఎమ్మెల్యే మాట్లాడుతూ తదుపరి ఇటువంటి పొరపాట్లు జరగకుండా హాస్పిటల్స్ సూపర్డెంట్ బాధ్యత తీసుకోవాలని సూచించడం జరిగింది, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జిలకర వాసు, కౌన్సిలర్ దామెర శ్రీనివాస్, మత్తమారి శ్రీనివాస్, రామగిరి మహేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# అందుకే 'కల్కి' బడ్జెట్ ఎక్కువ: ప్రభాస్

నాగ్ అశ్విన్ – ప్రభాస్‌ల కాంబోలో రానున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రం జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీంతో చిత్రబృందం ప్రమోషన్స్ మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ప్రభాస్, నాగ్ అశ్విన్‌లు ఓ ఆంగ్ల మీడియాతో ముచ్చటించారు.

"కల్కి' గ్లోబల్ రేంజ్‌లో ఉండనుంది. దీన్ని దేశవ్యాప్తంగా ఉన్న వారితో పాటు అంతర్జాతీయ ప్రేక్షకుల కోసం రూపొందించాం. అందుకే అంత ఎక్కువ బడ్జెట్ అయింది. దేశంలోని గొప్ప నటీనటులను తీసుకున్నాం. నన్ను అందరూ పాన్ ఇండియా స్టార్ అని పిలుస్తున్నారు. అది నాపై ఎలాంటి ప్రభావం చూపదు. కానీ, నన్ను అలా పిలవడాన్ని అభిమానులు ఇష్టపడతారు. వాళ్లకు ఆ పిలుపు సంతోషాన్నిస్తుంది' అని ప్రభాస్ అన్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. "కల్కి'సినిమా చూశాక ప్రేక్షకులు మరో ప్రపంచంలోకి వెళ్లొచ్చామనే భావనలో ఉంటారు. నేను 'అవతార్' చూశాక అలాంటి అనుభూతే పొందాను. ఒక కొత్త లోకాన్ని చూసినట్లు అనిపించింది. ఇప్పుడు 'కల్కి' చూశాక థియేటర్‌లో ఉన్న ప్రేక్షకులకు అలానే అనిపిస్తుంది. ఇందులోని పాత్రల పేర్లు కూడా ఇంటర్నేషనల్ ఆడియన్స్ కోసం పెట్టాం. వీటిలో ఎలాంటి మార్పులు చేయం' అని స్పష్టం చేశారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళంతో పాటు ఇంగ్లిష్‌తో సహా మరికొన్ని విదేశీ భాషల్లోనూ ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.




# "సత్యభామ" సెకండ్ ఇన్నింగ్స్ కాదు.. కోరిక తీరింది..

కాజల్ అగర్వాల్ లీడ్ రోల్ లో నటిస్తున్న సినిమా "సత్యభామ". నవీన్ చంద్ర అమరేందర్ అనే కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. "మేజర్" చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్ ప్లే అందించారు. క్రైమ్ థ్రిల్లర్ కథతో దర్శకుడు సుమన్ చిక్కాల రూపొందించారు. జూన్ 7న "సత్యభామ" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు ఈ సినిమా ప్రెస్ మీట్ హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ.. "సత్యభామ" సినిమాతో నా కెరీర్ లో కొత్త ప్రయత్నం చేశా. ఇలాంటి క్యారెక్టర్, మూవీ చేయడం ఇదే తొలిసారి. ఈ సినిమా కథ వినగానే నచ్చింది కొత్తగా అనిపించింది అందుకే సినిమా చేసేందుకు ముందుకు వచ్చా. నేను ఇలాంటి కథల్లో, క్యారెక్టర్స్ లో నటించాలి అనేది మైండ్ లో పెట్టుకోలేదు. మంచి కంటెంట్ ఉంటే ఏ జానర్ అయినా చేస్తాను. "సత్యభామ" కంటే ముందు ఫిమేల్ ఓరియెంటెడ్ మూవీస్ కోసం ఆఫర్స్ చాలా వచ్చాయి.

అయితే నేను ఆ మూవీస్ చేసేంత కాన్ఫిడెంట్ గా ఉన్నప్పుడు ఒప్పుకోవాలని అనుకున్నా. లేడీ ఓరియెంటెడ్ మూవీస్ చేస్తున్నప్పుడు నా మీద ప్రెజర్ ఉంది అనుకోవడం కంటే రెస్పాన్సిబిలిటీ ఉందని అనుకుంటా. ఈ సినిమాలో చాలా కొత్త ఎమోషన్స్ ఉన్నాయి. ఫస్ట్ టైమ్ నా కెరీర్ లో యాక్షన్, భారీ స్టంట్స్ చేశాను. వాటి కోసం చాలా కష్టపడ్డాను. "సత్యభామ" నా సెకండ్ ఇన్నింగ్స్ కాదు నా కెరీర్ మరో కొత్త దిశలో వెళ్తుందని అనుకోవచ్చు. యాక్టింగ్ నా ప్యాషన్ అందుకే నా పర్సనల్ లైఫ్‌లోకి వెళ్లిన తర్వాత మళ్లీ సినిమాల్లోకి వచ్చాను. ఈ సినిమాలో నా క్యారెక్టర్ పర్సనల్ లైఫ్, ప్రొఫెషనల్ లైఫ్ రెండూ బ్యాలెన్స్ చేస్తూ ఉంటుంది. ఈ సినిమా మేకింగ్ టైమ్ లో ఓ పెద్ద పోలీస్ ఆఫీసర్ ను కలిసినప్పుడు ఆయన నేడు క్రిమినల్స్ గేమింగ్, వర్చువల్ రియాలిటీ వంటి టెక్నాలజీ ద్వారా క్రైమ్స్ ఎలా చేస్తున్నారో వివరించారు. ఆయన చెప్పిన అంశాలు మాకు చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపించాయి. వాటిని కథలో పార్ట్ చేశాం. నేను ఫుల్ లెంగ్త్ యాక్షన్ మూవీ చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. "సత్యభామ" తో ఆ కోరిక తీరిందని అనుకుంటున్నా. అన్నారు.

# మోక్షజ్ఞ వారి వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు..




నట సింహం నందమూరి బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ సినీ ఎంట్రీ ఎప్పుడు ఉంటుందో అని ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు.ఇప్పటికే టాలీవుడ్ స్టార్ హీరోల వారసులు సినీ ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకులను ఎంతగానో మెప్పిస్తున్నారు.దీనితో బాలయ్య వారసుడు మోక్షజ్ఞ సినీ ఎంట్రీ కోసం నందమూరి అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.అయితే మోక్షజ్ఞ సినీ ఎంట్రీ పై బాలయ్య ఎప్పటికప్పుడు త్వరలో ఉంటుంది అని చెబుతూనే వున్నారు.అయితే ఎప్పుడు ఉంటుందో మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు.అయితే కొడుకు సినీ ఎంట్రీ పై బాలయ్య ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.మోక్షజ్ఞ మొదటి సినిమా భాద్యతను ఒక స్టార్ డైరెక్టర్ కు అప్పగించినట్లు సమాచారం.అయితే తనకు వరుస సూపర్ హిట్స్అందించిన బోయపాటి డైరెక్షన్ లోనే మోక్షజ్ఞ ఎంట్రీ ఉంటుందని బాలయ్య ఫ్యాన్స్ భావిస్తున్నారు.అయితే ఈ విషయంపై ఎలాంటి ఇన్ఫో లేదు.దీనితో మోక్షజ్ఞ మొదటి సినిమా డైరెక్ట్ చేసే ఆ దర్శకుడు ఎవరా అని ఫ్యాన్స్ తెగ ఎదురు చూస్తున్నారు.

అయితే తాజాగా బాలయ్య మాస్ కి దాస్ విశ్వక్ సేన్ నటించిన " గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి" మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు హాజరు అయ్యారు.అయితే ఆ ఈవెంట్ లో మోక్షజ్ఞ ఎంట్రీ గురించి కీలక వ్యాఖ్యలు చేసారు.మోక్షజ్ఞను నన్ను,నాన్న గారిని ఇన్స్పిరేషన్ గా తీసుకోవద్దని చెప్పాను.ఇప్పుడు నటిస్తున్న యంగ్ హీరోలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించినట్లు బాలయ్య తెలిపారు.అయితే మోక్షజ్ఞ ఎంట్రీ ఈ ఏడాదే ఉంటుందని కథ చర్చలు జరుగుతున్నట్లుగా కొన్ని వార్తలు వినిపిస్తున్నాయి.అయితే తాజాగా గ్యాంగ్స్ అఫ్ గోదావరి ప్రెస్ మీట్ లో విశ్వక్ సేన్ మోక్షజ్ఞ ఎంట్రీపై కీలక వ్యాఖ్యలు చేసారు.మోక్షజ్ఞ వైజాగ్ సత్యానంద్ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడని తెలిపారు.దీనిని బట్టి మోక్షజ్ఞ ఎంట్రీ త్వరలోనే ఉంటుందని బాలయ్య ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# భారీగా రెమ్యూనరేషన్ పెంచిన గ్లోబల్ స్టార్ ?



గ్లోబల్ స్టార్ రాంచరణ్, స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ "గేమ్ చేంజర్"..ఈసినిమాలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తుంది.స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈ సినిమాను భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.ఈ సినిమాలో క్యూట్ బ్యూటీ అంజలి ముఖ్య పాత్రలో నటిస్తుంది.అలాగే ఈ సినిమాలో సునీల్ ,నవీన్ చంద్ర ,ఎస్.జె సూర్య వంటి తదితరులు కీలక పాత్ర పోషిస్తున్నారు.ఈ సినిమా షూటింగ్ ఎప్పుడో మొదలైన కూడా కొన్ని కారణాల వల్ల షూటింగ్ ఆలస్యం అవుతూ వచ్చింది.డైరెక్టర్ శంకర్ ఇండియన్ 2 సినిమాతో బిజీ అవ్వడంతో రాంచరణ్ మూవీకి బ్రేక్ పడింది. ఇండియన్ 2 సినిమా రిలీజ్ కు సిద్ధం కావడంతో శంకర్ రాంచరణ్ మూవీతో బిజీ గా మారారు.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది.ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసి వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ మొదలు పెట్టాలని శంకర్ భావిస్తున్నారు. అయితే ఈ సినిమా తరువాత రాంచరణ్ ఉప్పెన ఫేమ్ బుచ్చి బాబు సన డైరెక్షన్ లో నటిస్తున్నారు.ఈ సినిమా ఎప్పుడో లాంఛనంగా ప్రారంభం అయింది.అయితే ఈ సినిమా కోసం రాంచరణ్ తీసుకుంటున్న రెమ్యూనరేషన్ హాట్ టాపిక్ గా మారింది.ఈ మూవీకి ఏకంగా 125 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకుంటున్నట్లు ఓ వార్త బాగా వైరల్ అవుతుంది.ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో తెరకెక్కిస్తోంది.ఈ సినిమా షూటింగ్ జూన్ లో మొదలు కానుంది.



# ఎవరయ్యా ఆ 'లక్ష్మి'.. మరో ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ తో ముందుకొచ్చిన విజయ్ సేతుపతి..

కోలీవుడ్ స్టార్ నటుడు విజయ్ సేతుపతి కథను నమ్మి సినిమా చేసే పాన్ ఇండియన్ హీరోలలో ఒకరు. ఈ టాలెంటెడ్ యాక్టర్ నటించిన తాజా చిత్రం 'మహారాజా'. తాజాగా సినిమా మేకర్స్ తమ రాబోయే చిత్రం మక్కల్ సెల్వన్ 50 ట్రైలర్‌ను విడుదల చేశారు. కేకే నగర్‌లోని ఓ బ్యూటీ సెలూన్ యజమానిగా విజయ్ సేతుపతి కనిపించనున్నాడని ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. ఇక ఈ ట్రైలర్ లో లక్ష్మి తన ఇంట్లో దొంగిలించబడిందని ఫిర్యాదు చేయాలనుకున్న విజయ్ సేతుపతి, తాను ఎఫ్ఐఆర్ ఫైల్ చేయడానికి వచ్చానని పోలీసులకు చెప్తాడు.

లక్ష్మి అంటే నగలు, పెట్టెలు, కాగితాలు కాదని అంటూ.. అలాగే కుమార్తె కాదు, భార్య కాదు, సోదరి కాదు.. లక్ష్మి ఎవరు అనే డైలాగ్స్ సినిమాకు క్యూరియాసిటీని పెంచాయి. థియేటర్లలో లక్ష్మి ఎవరో చూడాలని దర్శకుడు సినిమా చుట్టూ బజ్ క్రియేట్ చేయడంలో విజయం సాధించాడని చెప్పవచ్చు.

కురంగు బొమ్మై ఫేమ్ నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే విడుదలై సినిమాపై అంచనాలను పెంచేసింది. ప్యాషన్ స్టూడియోస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్, మమతా మోహన్ దాస్, నట్టి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక ఈ సినిమాకు అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించనున్నారు.



# హాయిహాయిగా.. నయనతార

తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కన్నడ భామ నయనతార . ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది. ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో బిజీబిజీగా ఉండే నయనతార ప్రస్తుతం వెకేషన్ మూడ్‌లో ఉంది. ఈ బ్యూటీ తన ఫ్యామిలీతో కలిసి టూర్ వేసింది. ఇంతకీ ఈ భామ ఎక్కడికెళ్లిందనే కదా మీ డౌటు.

పాపులర్ సిటీ హాంకాంగ్‌కు వెళ్లింది. అక్కడ ఓ రిసార్ట్స్‌లో తన పిల్లలతో కలిసి సేద తీరింది. హాంకాంగ్ వెకేషన్‌లో నయన్–విఘ్నేశ్ శివన్ చక్కర్లకు సంబంధించిన స్టిల్స్ కొన్ని నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి.